
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 25-8-2023 15/-

## ఎర్రకోట నుంచి కొత్తగా చెప్పిందేముంది?






మూర్తీభవించిన సంయమనం మూగవోయింది



సహజీవన భావాల పావురాయి

# గీటురాయి
వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 45 సంచిక: 34 హైదరాబాద్
శుక్రవారం 25 ఆగస్టు 2023 రూ.15-00
8 సఫర్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

ఎవరయితే పరిపూర్ణ చిత్తశుద్ధితో **'లాఇలాహ ఇల్లల్లాహు'** అనే సద్వచనాన్ని పలుకుతారో వారే ప్రళయదినాన నా సిఫారసుకు అర్హులవుతారు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



28

**బకాసురులు**

## లోపల...

| | | |
|---|---|---|
| బేటీ బచావ్ | ...... | 04 |
| ఎర్రకోట నుంచి కొత్తగా చెప్పిందేముంది? | ...... | 05 |
| హిజ్రీ నూతన సంవత్సరాన్ని స్వాగతించిన ముస్లిం ప్రపంచం | ...... | 10 |
| మూర్తీభవించిన సంయమనం మూగవోయింది | ...... | 12 |
| చరితార్థులు-2 : సుబేదార్ నాదిర్ అలీ ఖాన్ | ...... | 14 |
| ఈ వారం ఫేక్ న్యూస్ రౌండప్ | ...... | 15 |
| కన్యాశుల్కంలో ఉర్దూ పద ప్రయోగాలు-3 | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఒకరికొకరు దుస్తులు వంటి వారు | ..... | 20 |
| రైతుగా గుర్తింపులేని మహిళా రైతులు | ...... | 24 |
| హర్యానాలో బుల్‌డోజర్ రాజకీయాలు | ...... | 27 |
| నిశ్శబ్ద సందేశం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| నిజమైన దేశభక్తి | ...... | 34 |

### సలాం బాసిత్ భాయ్ ...!




మంచికీ మానవతకు
బాసిత్ భాయ్ పేరు
విలువల ప్రతిరూపం
తనకెవరు సాటిలేరు!

చిరునవ్వే ఆభరణం
సేవే ఆయన ప్రాణం
చివరి శ్వాస వరకు
విలువల్తో ప్రయాణం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

# బేటీ బచావ్

**ప్రధాని నరేంద్ర మోడీ** ఎర్రకోట నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ మహిళా సురక్ష గురించి మాట్లాడారు. బేటీ బచావ్ అనే నినాదం ఇంతకు ముందే ఆయన వినిపించారు.

కాని మహిళా సురక్ష గురించి ఆయన మాట్లాడుతున్నప్పుడు ఆయనలో ఆత్మవిశ్వాసం కనిపించిందా?

పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం మణిపూర్ హింసాకాండ విషయమై వచ్చింది. ముఖ్యంగా మణిపూర్‌లో ఇద్దరు మహిళలను, అందులో ఒక మహిళ కార్గిల్ వీరుడి భార్య, ఆ ఇద్దరిని వివస్త్రలను చేసి ఊరేగిస్తూ, వారిని అసభ్యంగా తాకుతూ క్రూరమృగాల గుంపులా వ్యవహరించిన సంఘటన వీడియో వైరల్ అయిన తర్వాత కూడా మణిపూర్ గురించి మాట్లాడడానికి ప్రధాని సిద్ధపడలేదు, చర్చించడానికి కూడా కుంటి సాకులతో, స్వల్పవ్యవధి చర్చతో సరిపెట్టాలనుకున్నారు. అందువల్ల ఈ అవిశ్వాస తీర్మానంతో ప్రతిపక్షాలు ప్రధాని మోడీ ఈ విషయమై మాట్లాడేలా చేయాలనుకున్నాయి. కాని అవిశ్వాస తీర్మానం చర్చలో మోడీ మాట్లాడుతూ గంటన్నర సేపు ప్రతిపక్షాలను విమర్శించడానికి, హేళన చేయడానికి సమయం గడిపారు. మణిపూర్‌లో మూడు నెల లుగా జరుగుతున్న అమానుషాలపై అవిశ్వాస తీర్మానం సందర్భంగా ఆయన జోకులేస్తూ మాట్లాడారు. నవ్వుతూ మాట్లాడారు. మహిళా సురక్ష గురించి మనసులో నిజాయితీ ఉన్నట్లయితే, మణిపూర్ వైరల్ వీడియో ఎంత క్రూరమైనదో తెలియదా? అలాంటి సందర్భంలో జోకులు, హేళనలతో ఎలా మాట్లాడతారు? ఈ విషయంపై వచ్చిన విమర్శల వల్ల కాబోలు ఎర్రకోట ప్రసంగంలో మొదట మణిపూర్ గురించి చెప్పి ప్రారంభించారు. కాని మణిపూర్ గురించి 30 సెకన్లు మాట్లాడడానికి మూడు నెలల టైము తీసుకున్నారు.

మణిపూర్ రాహుల్ గాంధీ పర్యటించారు. బాధితులను పరామర్శించారు. ఆ వెంటనే బీజేపీ నేతలు రాహుల్ గాంధీ వల్లనే మణిపూర్‌లో పరిస్థితి దిగజారిందనే విమర్శలు అందుకున్నారు. ఎర్రకోట ప్రసంగంలో మణిపూర్ గురించి ప్రస్తావించిన ప్రధాని మహిళా సురక్ష గురించి కూడా చెప్పారు. 2014 తర్వాత ఈ దేశంలో అమ్మాయిలు సైన్సు ఇంజనీరింగ్ చదువుతున్నారన్నది చాలా మందికి ఆశ్చర్యం కలిగించిందన్నారు. నిజమా? 2014కు ముందు దేశంలో అమ్మాయిలు మెడిసిన్, సైన్సు, ఇంజనీరింగ్ చదివే వారు కాదా?

మహిళా సురక్ష గురించి ప్రధాని మాట్లాడడం వినడానికి చాలా బాగుంది. కాని, ఆయన పార్టీకి చెందిన బ్రిజ్ భూషణ్ సింగ్ ఇంకా పదవిలోనే ఉన్నాడు. బీజేపీకి చెందిన నిశికాంత్ దూబే ప్రతిపక్షానికి చెందిన ఒక మహిళా సభ్యురాలి గురించి ట్వీటు చేస్తూ “నగర్ వధు” అనే పదం వాడాడు. అంటే వాడవదిన అనే పదంతో సమానమైనది. ఇలాంటి పదాలు ఒక మహిళ గురించి ప్రయోగించే నేతలు స్వయంగా బీజేపీలో ఉన్నారు. రామ్ రహీమ్ సింగ్‌కు ఏడు సార్లు పెరోల్ దొరికింది. అతనిపై ఆరోపణలు కాదు లైంగిక నేరాలు రుజువయ్యాయి.

ఇలాంటి చాలా ఉదాహరణలున్నాయి. కులదీప్ సింగ్ సెంగార్ బీజేపీ శాసనసభ్యుడు. ఆయనపై అత్యాచార ఆరోపణలు వచ్చాయి. స్వామీ చిన్మయానంద్ ఇలాంటి చాలా ఉదాహరణలున్నాయి. ఎలాంటి కఠినచర్యలు తీసుకున్నారు? బేటీ బచావ్ నినాదం ఇవ్వడం తప్ప.

ఢిల్లీలో మహిళా పహిల్వాన్లు, దేశానికి అంతర్జాతీయ మెడళ్ళు సాధించి పెట్టినవారు బ్రజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ప్రధాని ఇంతవరకు ఈ మహిళా పహిల్వాన్లతో మాట్లాడలేదు. బ్రిజ్ భూషణ్‌పై చర్యలు లేవు. ఆయన పదవిలో దర్జాగా కొనసాగుతున్నాడు. ఈ సమస్య పరిష్కరించడానికి ఒక కమిటీ పెట్టారు. కాని అందులో జరిగింది ఏదీ లేదు. కోచ్ లు చేసిన ఫిర్యాదులోని అంశాలు కూడా కమిటీ నివేదికలో లేవు. బ్రజ్ భూషణ్ సింగ్ పై అత్యంత తీవ్రమైన ఆరోపణలున్నాయని ఇప్పుడు స్పష్టమైన వార్తలు వస్తున్నాయి.

మన్మోహన్ సింగ్ కాలంలో నిర్భయ సంఘటన జరిగింది. ఢిల్లీ పోలీసులు రికార్డు సమయంలో నిందితులను అరెస్టు చేశారు. గాంధీ కుటుంబం నిర్భయ కుటుంబాన్ని పరామర్శించింది. అంతేకాదు వారికి అవసరమైన సహాయసహకారాలు అందించింది. అయినా అప్పటి పాత్రికేయులు నిర్భయంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రశ్నించారు.

కాని ఇప్పుడేం జరుగుతోంది. ఉదాహరణకు హాత్రస్‌లో ఏం జరిగింది? కథువా సంఘటన గుర్తుందా? ఏడేళ్ళ చిన్నారిపై అత్యాచారం హత్య సంఘటన జరిగితే నిందితులకు మద్దతుగా బీజేపీ నేతలు ర్యాలీ తీశారు. భారత చరిత్రలో అత్యాచారానికి పాల్పడిన నిందితులకు మద్దతుగా ఇలా ర్యాలీ తీసిన పార్టీ మరొకటి ఉందా?

అత్యాచారం సంఘటన ఏదన్నా జరిగినప్పుడు, బాధితురాలు హిందువు, నిందితుడు ముస్లిం పేరున్న వాడైతే చాలు లవ్ జిహాద్ గగ్గోలుతో బీజేపీ నేతలు మీడియా ఊదరగొడతాయి. కాని అత్యాచార సంఘటనలో నిందితుడు కూడా హిందువు పేరున్నట్లయితే పెద్దగా పట్టించుకోవడం లేదన్నది మనకు కనిపిస్తున్న వాస్తవం. అత్యాచారానికి పాల్పడిన నిందితుడు బీజేపీ నాయకుడు పులకిత్ ఆర్య విషయంలో బీజేపీ నేతలు ఏమన్నారు? మీడియా పెద్దవార్తగా కూడా చూడలేదు. అత్యాచారం కేసుల్లో నిందితుడెవడైనా సరే బాధితుల పక్షాన ప్రతి ఒక్క పార్టీ నిలబడాలి. కాని బీజేపీ అలా నిలబడుతుందా? హత్రస్, కథువా ఉదాహరణలతో తెలుస్తోందేమిటి?

బేటీ బచావ్, మహిళా సురక్ష గురించి బీజేపీ చెప్పే మాటల్లో నిజాయితీ ఉందా? రాజకీయం ఉందా? ✤

అబ్దుల్ వాహెద్



# ఎర్రకోట నుంచి కొత్తగా చెప్పిందేముంది?

**అగస్టు 15వ తేదీన** ప్రధాని మోడీ ఎర్రకోట నుంచి ప్రసంగించారు. 2024లో కూడా తానే ఎర్రకోట నుంచి మాట్లాడతానని అన్నారు. అంటే వచ్చే సాధారణ ఎన్నికల్లో కూడా తమ పార్టీయే గెలుస్తుందని, తానే ప్రధానిగా ఉంటానని ధీమా వ్యక్తం చేశారు. ఎప్పటి మాదిరిగానే ఆయన ప్రసంగం వారసత్వ రాజకీయాలపై, అవినీతిపై నడిచింది. సాధారణంగా ఆయన ప్రసంగాల్లో ఇవే మాటలు వినిపిస్తూ ఉంటాయి. వీటితో పాటు బుజ్జగింపు రాజకీయాల గురించి మాట్లాడతారు. ఇప్పుడు కూడా ఇవే మాటలు చెప్పారు. వారసత్వ రాజకీయాలు, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలన్న మాటలు పదే పదే చెబుతూ, అసలు ప్రజాసమస్యల నుంచి ఆయన ప్రజల దృష్టిని మళ్ళిస్తున్నారని చాలా మంది విమర్శించడంలో సత్యం లేదా!

ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అధినేత బిబేక్ దేబ్రాయ్ ఇప్పుడు మన రాజ్యాంగం పాతబడిపోయిందని, దాన్ని మార్చేయాలంటున్నారు. భారత రాజ్యాంగ రచనకు కొన్ని గంటలు, రోజులు లేదా వారాల చర్చ జరగలేదు. కొన్ని నెలల పాటు చర్చల తర్వాత రాసుకున్న రాజ్యాంగం ఇది. ఇప్పుడు ఆ రాజ్యాంగాన్ని మార్చేసి కొత్త రాజ్యాంగం తీసుకురావాలంటున్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో రాయబడిన ఈ రాజ్యాంగం ఇప్పుడు బీజేపీ నేతలకు కష్టం కలిగిస్తుందా? అందుకే ఈ రాజ్యాంగం 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ఉపయోగపడే రాజ్యాంగం కాదంటున్నారా? ఈ మాటలు చెప్పింది మరెవరో కాదు, స్వయంగా ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి అధినేత చెప్పారు. రాజ్యాంగంలోని సోషలిస్టు, సెక్యులర్, ప్రజాస్వామ్యం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే పదాలకు ఇప్పుడు అర్థాలేమిటో తెలుసుకునే ప్రయత్నాలు చేయాలని అన్నారు. ఈ పదాలకు అర్థాలు ఇప్పుడు మారిపోయాయా? లేకపోతే ఈ పదాలకు కొత్త నిర్వచనాలు వచ్చాయా? ఇప్పుడు మనం ఆలోచించవలసిన ప్రశ్నలివి. ప్రధానమంత్రికి సన్నిహితులైన వారు దేశ రాజ్యాంగాన్ని మార్చాలనే మాటను రాతపూర్వకంగా పత్రికల్లో రాస్తున్నారు. ఎందుకు రాజ్యాంగాన్ని మార్చేయవలసిన

అవసరం వచ్చింది? అనే ప్రశ్న ఎవరు అడిగే అవకాశం లేకుండా వారసత్వ రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాలు, అవినీతి అంటూ ప్రచారంతో హోరెత్తిస్తున్నారు.

ప్రధానమంత్రి మౌనం వహించిన సమస్యలేవో అందరికీ తెలుసు. కాని ఆ సమస్యలపై మాట్లాడేవారెవరు? ప్రధానమంత్రి కోరుతున్నట్లు వారసత్వ రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాలు, అవినీతిపై మాత్రమే చర్చ జరగాలనుకున్నప్పటికీ, ఆ చర్చ పూర్తి స్థాయిలో జరగాలి. ప్రధానమంత్రి తన మన్ కీ బాత్ మాత్రమే చెబుతారు. కాని ప్రశ్నలకు జవాబివ్వరు. వారసత్వ రాజకీయాలు, అవినీతి అని ఆయన చెప్పే అంశాలనే తీసుకుందాం. బీజేపీ పార్టీలో ఈ సమస్యలను నివారించడానికి ఆయన ఏం చేశారో చెప్పగలరా? వారసత్వ రాజకీయాలపై ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయగలరా?

బీజేపీలో వారసత్వ రాజకీయాల పరిస్థితి ఏమిటి? చట్టసభల సభ్యులు మొదలు కార్పోరేటర్ల వరకు వారసత్వ రాజకీయాలు కొనసాగడం లేదా?

ప్రధాని మోడీ కేబినేటులో పరిస్థితి చూద్దాం. ఎంత మంది వారసత్వ రాజకీయాల కారణంగా మంత్రులయ్యారో చూడండి. కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, ఒక సభలో గోలీమారో నినాదాలు చేయించిన మంత్రిగారు ఈయనే, ఈయన తండ్రి ప్రేమ్ కుమార్ ధూమల్ హిమాచల ప్రదేశ్ ముఖ్యమంత్రిగా రెండు సార్లు పనిచేశాడు. ఈ వారసత్వమే కదా అనురాగ్ ఠాకూర్ కు మంత్రిపదవి రావడానికి కారణం. గోలీమారో నినాదాలిప్పించే ఈ రాజకీయ నాయకుడు బీజేపీలో వారసత్వ రాజకీయాల వ్యతిరేక ఉద్యమానికి నిదర్శనంగా తన పదవికి రాజీనామా చేస్తాడా? 2024 ఎన్నికల్లో పోటీ చేయకుండా వెనక్కు తప్పుకుని వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా నిలబడతాడా? హిమాచల ప్రదేశ్‌లో బీజేపీ నేతలు చాలా మంది ఉన్నారు. అయినా ఈ అనురాగ్ ఠాకూర్‌ను మాత్రమే మంత్రిగా ఎందుకు చేశారు? ఆయన తండ్రికి ఉన్న రాజకీయ పలుకుబడి దీని వెనుక లేదా?

బీజేపీ అగ్రనేత రాజ్ నాథ్ సింగ్, ఆయన రక్షణ మంత్రిగా ఉన్నారిప్పుడు, ఆయన కుమారుడు పంకజ్ సింగ్ ఉత్తరప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు. నోయిడా నుంచి శాసనసభ్యుడు. రాజ్ నాథ్ సింగ్ వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ఉన్నారా? వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుతారా? కామర్స్ మంత్రి పీయుష్ గోయల్ విషయానికి వస్తే ఆయన తండ్రి పేరు వేదప్రకాష్ గోయల్. ఆయన వాజపేయి కాలంలో కేంద్ర మంత్రిగా పని చేశారు. పీయుష్ గోయల్ తల్లి చంద్రకాంత గోయల్ మాతుంగ నియోజక వర్గం నుంచి మూడు సార్లు వరుసగా ఎమ్మెల్యే. ఇప్పుడు కేంద్రమంత్రిగా ఉన్న పీయుష్

## నమ్మినా నమ్మకపోయినా? 3

# సున్నా విలువ

నమ్మినా నమ్మకపోయినా సంఖ్య 1 (ఒకటి) కంటే ముందు వ్రాసిన సున్నాకు విలువ లేదు – ఒకటికి ముందు లక్షల కొలది సున్నాలు చేర్చినాసరే.

అయితే ఒకటి (1) తరువాత సున్నా చేర్చితే అది 10 (పది) అనబడుతుంది. ఇలా ఎన్ని సున్నాలు చేర్చితే దాని విలువ అంతగానే పెరిగిపోతుంది.

అదేవిధంగా ఈ జగత్తులో ప్రతి వస్తువు సృజన వెనుక ఒక ఉద్దేశ్యం, లక్ష్యం, విలువ ఉంది. ఈ విధంగా ఆలోచిస్తే ఆయా వస్తువులు ఒక ఉద్దేశం కొరకు సృజించబడ్డాయి తప్ప వాటిని అట్టే నిల్వ చేయడానికి కాదని తెలుస్తుంది.

మనం మన సృష్టికర్తను విశ్వసించినపుడు మన సృజనకు కారణాన్ని తెలుసుకోగలం. ఆయనే మనకు జ్ఞానాన్నిచ్చాడు, ఫలితంగా మన జీవితం విజయవంతంగా కొనసాగేలా చేశాడు. దైవాన్ని విశ్వసించి ఆయన చూపిన మార్గంలో నడిచినప్పుడు మన సృష్టికి కారణాన్ని తెలుసుకోగలం. అప్పుడే ప్రతి పనిని ఒక ఉద్దేశానికి లోబడి నిర్వహించి జీవితాన్ని విజయవంతంగా సాగించగలం. ఒక విద్యార్థి తన ఉపాధ్యాయుని సూచనల ప్రకారం నడుచుకుంటే అతను ఉత్తమ రీతిలో విజయాన్ని సాధించగలడు. మనం కూడా దైవాదేశాలను సక్రమంగా పాలించినప్పుడే మన జీవితాలను సక్రమ రీతిలో నడిపి విజయాన్ని సాధించగలం.

దైవాదేశాల ప్రకారం నడుచుకున్నప్పుడే మనం దేవుని ప్రీతిని పొందగలం, అదే నిజమైన గొప్ప విజయానికి తార్కాణంగా నిలుస్తుంది.

మన సృష్టికర్తను, మన విధాతను విశ్వసించి ఆయన ఆదేశాల ప్రకారం నడుచుకోకపోతే, పరులతో ఎలా ప్రవర్తించాలో తెలుసుకోకపోతే ప్రపంచాన్ని, అందులోని వస్తువులను మన అభీష్టం ప్రకారం వాడుకుంటూ ఎన్ని అద్భుతాలు, ఆకర్షణలు సృష్టించినా అలాంటి జీవితం విజయవంతం కాదు, దానికి విలువా వుండదు.

దైవాన్ని విశ్వసించక, ఆయన మార్గాన్ని అనుసరించని మనిషి జీవితం ఒకటి సంఖ్యకు ముందు చేర్చిన సున్నాల మాదిరిగానే విలువ లేనిదిగా మారుతుంది తప్ప విజయవంతం కాదు.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

గోయల్ వారసత్వ రాజకీయాలపై ఎలా పోరాడుతారో? తల్లిదండ్రుల వారసత్వాన్నే కదా ఆయన కొనసాగిస్తున్నది? దేశంలో వారసత్వ రాజకీయాలకు కాలం చెల్లిందని ఈ బీజేపీ నేతలు ఎలా చెబుతున్నారు? స్వయంగా పార్టీలోనే వారసత్వ రాజకీయాలు కొనసాగుతున్నాయి. ఇక విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయానికి వస్తే, ఆయన తండ్రి దేబేంద్ర ప్రధాన్ కూడా గతంలో వాజపేయి కాలంలో మంత్రిగా పని చేశారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తండ్రి రించిన్ ఖారు అరుణాచల ప్రదేశ్ రాష్ట్రానికి మొట్టమొదటి ప్రోటెమ్ స్పీకర్‌గా పనిచేశారు. ఇక కాంగ్రెసు నుంచి బీజేపీలోకి దూకిన జ్యోతిరాదిత్య సింధియా విషయానికి వస్తే ఆయనకు బీజేపీ మంత్రి పదవి కట్టబెట్టింది. జ్యోతిరాదిత్య సింధియా తండ్రి మాధవరావు సింధియా కాంగ్రెసు కాలంలో పౌరవిమానయాన మంత్రిగా ఉండేవారు. ఇప్పుడు అదే పదవి బీజేపీ ఆయన కుమారుడికి కట్టబెట్టింది. కాంగ్రెసు పార్టీ వారసత్వ రాజకీయాల గురించి విమర్శిస్తున్నప్పుడు అదే కాంగ్రెసు నుంచి వారసత్వ రాజకీయాల వల్లనే వచ్చిన జ్యోతిరాదిత్య సింధియాకు బీజేపీ పెద్దపీట వేసి మంత్రిపదవి ఎందుకు ఇచ్చింది? ఇలా వారసత్వ రాజకీయాలతో పదవులు పొందిన ఈ నేతలు వారసత్వ రాజకీయాలపై నీతులు చెబుతుంటే వినేవాళ్ళేమనుకుంటారు? అసలు చెప్పేవాళ్ళు కూడా తాము చెబుతున్న మాటలపై తామే నవ్వుకుంటున్నారా?

ప్రధాని చాలా గట్టిగా వారసత్వ రాజకీయాలు నడిపే పార్టీలంటూ విమర్శించారు. వారసత్వ రాజకీయాలపై విరుచుకుపడ్డారు. ప్రధాని మోడీ తన పార్టీలో వారసత్వ రాజకీయాలపై పోరాడుతారా? మిత్రపక్షాల్లో వారసత్వ రాజకీయాలపై పోరాడుతారా? ప్రధానమంత్రి ప్రసంగాల్లో పదే పదే వారసత్వ రాజకీయాలు, అవినీతి, బుజ్జగింపులనే మాటలే వినిపిస్తాయి కాని ప్రజల సమస్యలెప్పుడు ఆయన ప్రసంగాల్లో వినబడవు. ప్రజల మాట వినడానికి కూడా ఆయన సిద్ధంగా ఉన్నట్లు కనిపించరు. మణిపూర్ విషయంలో ఆయన చేసింది అదే.

బీజేపీలో వారసత్వ రాజకీయాల జాబితా తీయడం ప్రారంభిస్తే పుస్తకాలు రాయవచ్చు. శివసేనను చీల్చి మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని పడగొట్టారు. బీజేపీ శిబిరంలోకి వచ్చి ఏక్ నాథ్ షిండే మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యాడు. ఏక్ నాథ్ షిండే కుమారుడు లోక్ సభ సభ్యుడు. బీజేపీ మరో మిత్రపక్షం రామ్ విలాస్ పాశ్వాన్ పార్టీ. రామ్ విలాస్ పాశ్వాన్ బీజేపీ శిబిరంలోకి వచ్చినప్పుడు ఆయన పార్టీలో అందరూ ఆయన కుటుంబానికి చెందిన వారే. రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ ఇప్పుడు ఎన్డీయే మిత్రపక్షంగా తన పార్టీని నడుపుతున్నాడు. ఆ పార్టీలో చిరాగ్ పాశ్వాన్ కాకుండా మరొకరెవరైనా అధ్యక్షుడయ్యే అవకాశం ఉందా? ఇక వసుంధరరాజే సింధియా విషయానికి వస్తే, ఆమె కుమారుడు దుష్యంత్ సింగ్ రాజకీయాల్లో ప్రముఖంగా ఉన్నాడు. వసుంధర రాజె సింధియా బీజేపీ ముఖ్యమంత్రిగా పనిచేశారు. తల్లికొడుకులు ఇద్దరు రాజకీయాల్లో ఉండడానికి కారణం వారసత్వ రాజకీయాలు కాదా. అలాగే మరో బీజేపీ నేత సోనే లాల్ పటేల్, ఆయన కుమార్తె అనుప్రియా పటేల్ ఇప్పుడు మంత్రిగా ఉన్నారు.

బీజేపీ మిత్రపక్షాలుగా ఉన్న అనేక పార్టీల్లో వారసత్వ రాజకీయాలే ప్రధానం. స్వయంగా బీజేపీలో కూడా వారసత్వ రాజకీయాల జాబితా చాలా పెద్దది. ఇటీవల సంజయ్ రాజభర్ పార్టీ, నిషాత్ పార్టీ బీజేపీ కూటమిలో చేరింది. ఇక మహారాష్ట్రలోకి వస్తే అజిత్ పవార్ రాజకీయాల్లోకి రావడం వెనుక శరద్ పవార్ వారసత్వం లేదా? అజిత్ పవార్ కి బీజేపీ ఇప్పుడు ఘనస్వాగతం ఎందుకు పలికింది. నారాయణ్ రానే కుమారుడు నితేష్ రానే ఎమ్మెల్యే. ఇక మధ్యప్రదేశ్ విషయానికి వస్తే కైలాస్ విజయవర్గీయ్ బీజేపీలో ప్రముఖ నాయకుడు, ఆరు సార్లు ఇండోర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆయన కుమారుడు ఆకాష్ కూడా ఎమ్మెల్యే. ఇవి వారసత్వ రాజకీయాలు కాదా? ఇలాంటి పేర్లు బీజేపీలో ఇంకా చాలా ఉండొచ్చు. వారసత్వ రాజకీయాలతో కుమారులను, కుమార్తెలను, అల్లుళ్ళను రాజకీయాల్లోకి దింపిన నేతలు చాలా మంది ఉన్నారు. ప్రధాని మోడీ చాలా కాలంగా వారసత్వ రాజకీయాల గురించి విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. ఇంతకాలంగా తన స్వంత పార్టీలో, బీజేపీ మిత్రపక్షాల్లో వేళ్ళూనుకుపోయిన వారసత్వ రాజకీయాల విషయంలో ఏం చేశారు? ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? ఈ ప్రశ్నలకు కూడా ఆయన జవాబిస్తే బాగుండేది. కాని ఆయన ఎప్పుడు జవాబులు ఇవ్వరు.

పార్లమెంటు ఆవరణలో వారసత్వ రాజకీయాలను నిరసిస్తూ బ్యానర్లతో ప్రదర్శన నిర్వహించిన నీరజ్ శేఖర్ తండ్రి చంద్రశేఖర్ మాజీ ప్రధానమంత్రి అని మరిచిపోతే ఎలా? నీరజ్ శేఖర్ ఇప్పుడు బీజేపీ నేతగా వారసత్వ రాజకీయాల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా లేదా? బీజేపీ ప్రముఖ నాయకుడు గోపీనాథ్ ముండే కుమార్తె పంకజ ముండే బీజేపీలో జాతీయ కార్యదర్శి హోదాలో ఉన్నారు. బీహారులో బీజేపీ ఎంపీ సంజయ్ జైస్వాల్ తండ్రి మదన్ ప్రసాద్ జైస్వాల్ కూడా అదే సీటులో ఎంపిగా ఉండేవారు. ఈ నియోజకవర్గంలో జైస్వాల్ కుటుంబం దశాబ్దాలుగా రాజకీయ పెత్తనం చెలాయించడం లేదా? సంజయ్ జైస్వాల్ కూడా ఇప్పుడు బీజేపీ నాయకుడిగా వారసత్వ రాజకీయాలపై భీకర పోరాటం చేస్తామంటున్నాడు. ఈ నేతలందరు వారసత్వ రాజకీయాల ద్వారా పదవులు పొందలేదని చెప్పడానికి ప్రమాణాలేమిటి? మధుబని పార్లమెంటు సభ్యుడు అశోక్ యాదవ్ తండ్రి హుకుందేవ్ నారాయణ్. ఆయన కూడా

బీజేపీ నాయకుడే. మధుబనిలో మరో బీజేపీ నేత ఎవ్వరు లేరా? మరో బీజేపీ కార్యకర్త ఎవ్వరు లేరా? ఎందుకు హుకుందేవ్ నారాయణ్ కుమారుడు అశోక్ యాదవ్‌కు మాత్రమే సీటు ఇచ్చారు.

జయంత్ సిన్హా పేరు గుర్తుందా? మూకహత్య నేరస్తులను కలిసి వారిని సన్మానించి, పూలమాలలు వేసి, మిఠాయిలు తినిపించిన బీజేపీ నాయకుడు. ఇదంతా ఆయన బీజేపీ మంత్రిగా ఉండి చేసిన పనులు. ఆయన తండ్రి యశ్వంత సిన్హా బీజేపీలో ప్రముఖ నాయకుడిగా మంత్రిగా పనిచేశారన్నది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇది వారసత్వ రాజకీయం కాదా? ఇలాంటి చాలా ఉదాహరణలున్నాయి. ఇవన్నీ మోదీ గారికి తెలియనివి కూడా కాదు. ఆయనకు బాగా తెలుసు. అయినా వారసత్వ రాజకీయాలపై ఆయన ప్రసంగాలు ఇలాగే ప్రతి సంవత్సరం చేస్తూ ఉంటారు. చాలా మంది వింటూ ఉంటారు. ఎందుకంటే ఆయన వారసత్వ రాజకీయాలు అని చెబుతున్నది కాంగ్రెసుపార్టీని విమర్శించడానికి మాత్రమే అని ఆయన ఓటర్లకు తెలుసు. తన ఓటర్లను ఏ మాటలతో సంతోషపెట్టాలో ప్రధానికి బాగా తెలుసు. బీజేపీలో వారసత్వ రాజకీయాలున్నాయి. బీజేపీ మిత్రపక్షాల్లో వారసత్వ రాజకీయాలున్నాయి. అంతేకాదు, వారసత్వ రాజకీయాలను బీజేపీ దిగుమతి కూడా చేసుకుంటుంది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల సమయంలో కాంగ్రెసు నుంచి ఆర్.పి.ఎన్ సింగ్ బీజేపీలోకి పార్టీ మార్చాడు. ఆయన తండ్రి చంద్రప్రతాప్ నారాయణ్ సింగ్ కూడా పార్లమెంటు సభ్యుడే. వారసత్వ రాజకీయాలతో చట్టసభలోకి వచ్చిన వ్యక్తిని బీజేపీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించింది. మరో పేరు చెప్పుకోక తప్పదు. సునీల్ ఝాకడ్‌ను కాంగ్రెసు నుంచి బీజేపీ దిగుమతి చేసుకుంది. సునీల్ ఝాకడ్ ఇప్పుడు పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు. ఆయన తండ్రి బలరాం ఝాకడ్ లోక్ సభ స్పీకరుగా పనిచేశారు. ఆయన పెద్ద కుమారుడు సజ్జన్ కుమార్ ఝాకడ్ పంజాబులో మంత్రిగా పనిచేశాడు. ఇక బెంగాలుకు వస్తే అధికారి సోదరుల కథ వారసత్వ రాజకీయాల చిరునామ. వీళ్ళు కాంగ్రెసు నుంచి తృణమూల్ కాంగ్రెసులోకి వచ్చారు. వారసత్వ రాజకీయాలు అంత చెడ్డవే అయితే బీజేపీ ఈ వారసత్వ రాజకీయాల సోదరులను బీజేపీలోకి ఎందుకు సాదరంగా ఆహ్వానించింది. శిశిర్ అధికారి తృణమూల్ నుంచి ఎమ్మెల్యే తర్వాత బీజేపీలోకి చేరాడు. ఆయన తన సభ్యత్వానికి కూడ రాజీనామ చేయలేదు. శిశిర్ అధికారి కుమారుడు సుభేందు అధికారి బెంగాల్లో తృణమూల్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశాడు. ఇప్పుడు బీజేపీలో చేరి, ప్రతిపక్ష నేతగా ఉన్నాడు. సుభేందు అధికారి సోదరుడు సోమేందు అధికారి కాంత మునిసిపాలిటీ ఛైర్మన్. సుభేందు అధికారి మరో సోదరుడు దివ్యేందు అధికారి పార్లమెంటు సభ్యుడు. వీళ్ళందరు ఇప్పుడు బీజేపీతో చెట్టాపట్టాలేసుకు తిరుగుతున్నారు. ఈ కుటుంబం మునిసిపాలిటీ పదవులు మొదలుకుని ఎమ్మెల్యే, ఎం.పి పదవుల వరకు పంచుకుంది. ఈ నేతలందరినీ అక్కున చేర్చుకుంటున్న మోదీ వారసత్వ రాజకీయాలపై పోరాడుతానంటున్నారు?

కాని విచిత్రమేమిటంటే, ప్రధాని మోదీ వారసత్వ రాజకీయాల గురించి పదే పదే చెబుతున్నప్పటికీ, ఆయన స్వంత పార్టీలో, మిత్రపక్షాల్లో వారసత్వ రాజకీయాలు ప్రత్యక్షంగా కనిపిస్తున్నప్పటికీ మన మీడియా ఎప్పుడు ఈ ప్రశ్నలు అడగలేదు. అడుగుతుందన్న ఆశ కూడా లేదు.

బీజేపీలో వారసత్వ రాజకీయాలపై ప్రధాని మోదీ ఎన్నడూ ఒక్క మాట చెప్పలేదు. మిత్రపక్షాల్లో వారసత్వ రాజకీయాలపై కూడా ఆయనేమీ చెప్పడం లేదు. వారసత్వ రాజకీయాల గురించి మాట్లాడేదయితే వీటన్నింటి గురించి మాట్లాడాలి. కాని ఆయన అలా చేయడం లేదు. కేవలం గాంధీ నెహ్రూ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని మాత్రమే ఆయన మాట్లాడుతుంటారు. వారసత్వ రాజకీయాలు చెడ్డవైతే గాంధీ నెహ్రూ కుటుంబమే కాదు, ప్రతి రాజకీయ కుటుంబంలోను ఇవి చెడ్డవే. కేవలం ఒక కుటుంబం విషయంలో మాత్రమే వారసత్వ రాజకీయాలు చెడ్డవి. మిగిలిన వారి విషయంలో చెడ్డవి కావనుకోవడం హాస్యాస్పదం. బీజేపీ కర్నాటక నాయకుడు యదురప్ప కుమారులు బి.వై.రాఘవేంద్ర, బి.వై విజయేంద్ర ఇద్దరు కూడా బీజేపీ నేతలు. ఇందులో ఒకరు ఎం.పీ. మరొకరు ఎమ్మెల్యే. కర్నాటక ముఖ్యమంత్రిగా పనిచేసిన యస్. ఆర్. బొమ్మయ్ జనతాపార్టీలో ఉండేవారు. ఆయన కుమారుడు బి.యస్. బొమ్మయ్‌ను బీజేపీ ముఖ్యమంత్రి చేసింది. వారసత్వ రాజకీయాలపై ప్రధాని మోదీ ఇలా పోరాడుతారా? వసుంధర రాజే సింధియా, యశోధర రాజే, దుష్యంత్ సింగ్ వీళ్ళ రాజకీయాలు వారసత్వ రాజకీయాలు కావా? ప్రధాని ఈ నేతల గురించి ఎందుకు మాట్లాడడం లేదు. కాబట్టి వారసత్వ రాజకీయాల గురించి చెబుతున్న ఈ మాటలేవీ నిజాయితీగా చెబుతున్న మాటలు కాదు.

బీజేపీ 2014 నుంచి భారీ మెజారిటీతోనే అధికారంలో ఉంది. తొమ్మిదేళ్ళు గడిచిపోయాయి. పదవ సంవత్సరం నడుస్తోంది. అవినీతి అంతం చేసేస్తాం అంటూ నోట్ల రద్దు చేశారు, జియస్టీ తీసుకువచ్చారు. కాని అవినీతిని ఎందుకు అంతం చేయలేక పోయారు. ఇప్పుడు కూడా అవినీతి క్విట్ ఇండియా అనే నినాదంతోనే ఓట్లు పొందవచ్చని ఎందుకనుకుంటున్నారు? నోట్లరద్దుతో అవినీతి అంతంకాలేదు, కానీ ఆర్థికవ్యవస్థ నడుం విరిగి కూలబడింది. ఈ వాస్తవాలు చెప్పరు. ఇక అవినీతి విషయానికి వస్తే ఇతర పార్టీల నుంచి అవినీతి ఆరోపణల

నేతలు క్యూ కట్టి బీజేపీలోకి వస్తుంటే వారందరినీ సాదరంగా చేర్చుకుంటున్నారు. ఇతర పార్టీలను చీల్చి ప్రభుత్వాలు పడగొట్టడం ఎన్ని రాష్ట్రాల్లో జరిగింది. ఇందులో అవినీతి లేకుండానే ప్రభుత్వాలు కూలిపోయాయా? కేంద్ర నిఘాసంస్థల పనితీరు గత కొన్ని సంవత్సరాలుగా పరిశీలిస్తే కేవలం ప్రతిపక్షాలు మాత్రమే టార్గెటుగా కనిపిస్తాయి. ఎవరిపై విచారణ జరుగుతుందో ఆ నాయకుడు బీజేపీలో చేరితే చాలు విచారణలు అటకెక్కుతాయి. పైగా పదవులు లభిస్తాయి. ప్రతిపక్ష నేతలపై మాత్రమే ఎందుకు నిఘాసంస్థలు దృష్టిపెట్టి విచారణలు నడుపు తున్నాయి? ప్రతిపక్ష నేతలను బెదిరించడానికి, ప్రతిపక్షాలకు ఎవ్వరు నిధులు విరాళాలు ఇవ్వకుండా భయపెట్టడానికే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కాస్త లోతుగా చూస్తే ఇది కూడా అవినీతే. ఎలక్టోరల్ ఫండ్ రూపంలో రాజకీయ పార్టీలకు నిధులు అందుతున్నాయి. ఇది కూడా ఒకవిధమైన అవినీతే అని కొందరు విశ్లేషిస్తున్నారు. ఎలక్టోరల్ బాండ్లలో పారదర్శకత కనిపించదు. ఎవరు ఎంత సొమ్ము ఇచ్చారు. దానికి బదులుగా ఎలాంటి బహుమతులు పొందా రన్నది తెలుసుకునే అవకాశమే లేదు. బీజేపీకి 5271 కోట్ల రూపాయల విరాళాలు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వచ్చాయని ఇటీవల ఒక నివేదిక వచ్చింది. మిగిలిన పార్టీలన్నింటికి కలిపినా వారికి దొరికిన నిధులు 1783 కోట్ల రూపాయలు మాత్రమే. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో చాలా అవినీతి గురించి చాలా మంది మాట్లాడుతున్నారు.

ఎన్నికల వ్యయంపై ఎందుకు మాట్లాడడం లేదు? ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి చేస్తున్న ఖర్చుపై ఎందుకు మాట్లాడడం లేదు? ధనస్వామ్యం గురించి ఎందుకు మాట్లాడడం లేదు? డబ్బులు వెదజల్లి ఎన్నికల్లో గెలవవచ్చనే వైఖరి పెరగడం దేన్ని సూచి స్తుంది? ఈ ప్రశ్నలు ఏవీ ఎవరు అడగకుండా ఉండడానికే వారసత్వ రాజకీయాలంటూ బల్లగుద్ది మాట్లాడుతున్నారు. అసలు సమస్య రాజకీయాల్లో డబ్బు. దీనిపై ప్రధాని ఎప్పుడైనా మాట్లాడారా? అవినీతి విషయానికి వస్తే కర్నాటకలో బీజేపీపై అవినీతి ఆరోపణలు ఎన్ని వచ్చాయి? మధ్యప్రదేశ్ లో కూడా అవినీతి ఆరోపణలు వినవస్తున్నాయి. కాగ్ నివేదిక వచ్చింది. ఢిల్లీకి అనుకుని ద్వారకా ఎక్స్ ప్రెస్ వే గురించి రాసింది. కిలో మీటరు రహదారికి కేవలం 18 కోట్లు ఖర్చయ్యే పనికి 250 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారని చెప్పింది. ఇది అవినీతి కాదా? హిండెన్ బర్గ్ రిపోర్టు వచ్చింది. అదానీ వ్యవహారంలో విచారణ జరగాలని డిమాండ్లు వచ్చాయి. కాని ప్రభుత్వం అసలు అదానీ పేరు ఎత్తడాన్ని కూడా సహించడం లేదు. ఆయుష్మాన్ భవ పథకం అమలులో కూడా కాగ్ అవినీతి వేలెత్తి చూపిం చింది. అయోధ్య విషయంలో కూడా కాగ్ అవినీతి ఎత్తి చూపించింది. లంచాల గురించి చెప్పింది. కాని వీటన్నింటిపై ప్రధాని మౌనంగా ఉన్నారు.

ప్రధాని బుజ్జగింపు రాజకీయాల గురించి మాట్లాడుతున్నారు. బుజ్జగింపు రాజకీయాలను తుడిచిపెట్టేశారా? హర్యానా నూహ్ గురుగ్రామ్ లలో హింసాకాండ జరిగింది. ప్రధాని మౌనంగా ఉన్నారు. ఈ హింసాకాండ తర్వాత అక్కడి రాష్ట్రప్రభుత్వం ఒకే సముదాయానికి చెందిన వారి ఇండ్లు దుకాణాలు బుల్డో జర్లతో ధ్వంసం చేసింది. ఇది ఎవరిని బుజ్జగించే బుజ్జగింపు రాజకీయం? బుల్డోజర్ రాజకీయాలు ఉత్తరప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కొనసాగుతున్నాయి. కూలగొట్టబడుతున్న ఇండ్లు ఆస్తులు అన్నీ దాదాపుగా ఒకే సముదాయానికి చెందినవనే ఆరోపణలు బలంగా వస్తున్నాయి. ఇది ఎవరిని బుజ్జగించే రాజకీయం. బిల్కిస్ బాను సామూహిక అత్యాచారం, మూడేళ్ళ పసిబాలుడి హత్య కేసులో శిక్ష అనుభ విస్తున్న దోషులను విడుదల చేయడం ఎలాంటి బుజ్జగింపు రాజకీయం? ఎవరిని బుజ్జగిస్తున్నారు? ప్రధాన స్రవంతి మీడియాగా పిలువబడే జాతీయ చానళ్ళలో బాహాటంగా ముస్లిం విద్వేషాన్ని రెచ్చగొట్టే కార్యక్రమాలు, వ్యాఖ్యలు ఎలాంటి బుజ్జగింపు రాజకీయాలు? జంతర్ మంతర్ నుంచి హరిద్వార్ వరకు ముస్లిముల ఊచకోతల పిలుపులతో బాహాటంగా మతో న్మాద శక్తులు ప్రసంగాలు చేస్తూంటే, హింసోన్మాదాన్ని రెచ్చగొడు తుంటే చూసి చూడనట్లు వ్యవహరించడం బుజ్జగింపు రాజ కీయం కాదా? హిందూత్వ ఓటర్లను బుజ్జగించే రాజకీయం కాదా?

బీజేపీకి బాగా తెలుసిని విషయమేమిటంటే మెజారిటీ సముదా యానికి సంబంధించిన విషయమైతే, మైనారిటీలకు మద్దతుగా మాట్లాడడం రాజకీయంగా చాలా నష్టదాయకమని ప్రతిపక్షాలు కూడా అర్థం చేసుకున్నాయి. కాంగ్రెసు కూడా అర్థం చేసుకుంది. అందుకే మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసు భాగేశ్వర్ బాబాకి జై అంటుంది. రాజస్థాన్‌లో కాంగ్రెసు మోను మనేసర్ ఎక్కడున్నాడో మాకు తెలియదు అంటుంది. ఇవి మెజారిటీ సముదాయాన్ని బుజ్జగించే రాజకీయాలు కాదా? వీటి గురించి మాట్లాడుతున్న వారెవరు?

2014 నుంచి మోడీ అధికారంలో ఉన్నారు. ఇప్పుడు కూడా ఆయన బుజ్జగింపు రాజకీయాల గురించి మాట్లాడుతున్నారంటే (బుజ్జగింపు రాజకీయాలు అంటే ముస్లిముల బుజ్జగింపు రాజ కీయాలు గతప్రభుత్వాలు నడిపేవన్నదే ఆయన అభిప్రాయం) ఏమని అర్థం చేసుకోవాలి. బుజ్జగింపు రాజకీయాలే జరిగి ఉంటే ముస్లిములకు దానివల్ల లభించిన ప్రయోజనాలేమిటో ఆయన లెక్క చెప్పవలసింది.

ఏది ఏమైనా ఎర్రకోట ప్రసంగంలో కొత్తగా చెప్పింది ఏదీ లేదు. పాత ప్రసంగమే మరోసారి పునరుద్ఘాటించారు. ✤

# హిజ్రీ నూతన సంవత్సరాన్ని స్వాగతించిన ముస్లిం ప్రపంచం



షేక్ అబ్దుల్ సమద్

**ఇస్లాం అవగాహన విషయంలో** ప్రపంచంలో విప్లవాత్మక పరిశోధనలు జరుగుతున్నాయి. మొహరంకు పరిమితమైన సామాన్య ప్రజానీకం ఇప్పుడు హిజ్రీ సంవత్సరం ప్రాధాన్యత గ్రహిస్తున్నారు. ధార్మిక ఆధారం లేకున్నా మధ్యన వచ్చిన పీర్ల పేర చేసే కార్యక్రమాల ప్రాశస్త్యం తగ్గిపోయిందని చెప్పవచ్చు. ప్రారంభం మాసమైన మొహర్రంలో చాలామంది నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటున్నారు.

సంవత్సరంలోని నెలలు ప్రస్తావిస్తూ దివ్య ఖుర్ఆన్, "యథార్థం ఏమిటంటే, ఆకాశాన్నీ భూమినీ అల్లాహ్ సృష్టించినప్పటి నుండి మాసాల సంఖ్య అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే..." (9:36). మొహర్రం మాసం కూడా పవిత్ర నాలుగు మాసాలలో ఒకటి. మొహర్రంలో 'ఆషురా' పేర్కొన్న పదవ రోజు ఉపవాసం రమజాన్ మాసం రోజా తరువాత అంతా ప్రాశస్త్యం కలది. మొహర్రంలో ఉపవాసం వల్ల గత సంవత్సరంలో చేసిన పాపాలు మన్నించబడుతాయనీ ప్రవక్త ముహమ్మద్ (స) తాకీదు చేసారు.

ప్రవక్త ముహమ్మద్ (స) మదీనా నగరానికి వలస వెళ్ళిన సంఘటన హిజ్రీ సంవత్సరానికి నాందిగా ప్రామాణికం కావడం మరీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఆంగ్ల క్యాలెండర్ తరువాత ప్రపంచంలో అత్యధికంగా ఉపయోగించేది హిజ్రీ క్యాలండరే! తెలుగు, తమిళ, మలయాళీ లాంటి ప్రాంతీయ క్యాలెండర్లు వాడుతున్న, ప్రపం చంలో ఇంచుమించు 145 కోట్ల మంది అంటే ప్రపంచ జనాభాలో 25 శాతం ప్రజలు హిజ్రీ క్యాలెండర్ అమలుతో తమ రోజువారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హిజ్రీ క్యాలెండర్ ఇస్లామిక్ ప్రమాణాల అనుబంధంగా లెక్కిస్తారు కాబట్టి దీన్ని ఇస్లామిక్ క్యాలెండర్‌గా కూడా పిలుస్తారు.

హిజ్రీ క్యాలెండర్ పూర్తిగా చాంద్రమానంపై గుణించబడుతుంది. అంటే రోజు చంద్రుని ఆగమనంతో ప్రారంభం అవుతుంది. మొదట రాత్రి - పగలు ఇలా కాలచక్రం నడుస్తుంది. ఇస్లామీయ పంచాంగం మొట్టమొదటి క్రీ.శ. 638 సంవత్సరంలో రెండవ ఖలీఫా ఉమర్ ఇబ్నె అల్ ఖత్తాబ్ అమలులోకి తెచ్చారు. ప్రవక్తల పుట్టుకనో, యుద్ధాలనో కాలమానం నిర్దేశాలుగా తీసుకోక మహా ప్రవక్త ముహమ్మద్ (స) మక్కా నుండి మదీనా వలస పోయిన చారిత్రక దినాన్ని ప్రామాణికంగా తీసుకుని నిర్ధారించారు. మొహర్రం నెల ఒకటవ తేది హిజ్రీ శకానికి నాందిగా నిలచింది. ఆ లెక్కన క్రీ.శ. 16-07-622 సంవత్సరం హిజ్రీ శకారంభ మైంది. ప్రవక్త(స) వలస వెళ్ళడం ఓ శాంతికాముక జీవన విధాన స్థిరత్వానికి పునాదిగా నిలిచింది.

ఇస్లామియా క్యాలెండర్ పూర్తిగా చంద్రమానంపై లెక్కించడం వల్ల సోలార్ క్యాలెండర్ కన్నా ప్రతి సంవత్సరం పదకొండు రోజులు తక్కువగా ఉంటాయి. అందుకే ముస్లింల పండుగలు ఒకే రుతువులో రావు. మాసాలు సైతం అన్ని వివిధ రుతువులలో వస్తుంటాయి. ఈ కాల భ్రమణం ప్రతి 33 సంవత్సరాలకు ఒకసారి పూర్తి అవుతుంది. చంద్రదర్శనంతో మాసం ప్రారంభ మవుతుంది కాబట్టి ప్రపంచమంతా అక్కడి కాలానుగుణంగా ఒకరోజు అటోఇటో మాసారంభం గుర్తిస్తారు. ఆ లెక్కన క్రీ.శ 20-7-2023, హిజ్రీ శకం నూతన సంవత్సరంగా 01-01-1445 ప్రారంభం అయింది. నెలవంక దర్శనమే ప్రారంభం కాబట్టి సామాన్యుడు, పామరులు సైతం కాలమానాన్ని లెక్కించడం సులభమే!

దివ్యఖుర్ఆన్ సైతం కాలమానాన్ని ఉటంకిస్తూ, **"రాత్రినీ, పగలునూ సృష్టించినవాడూ, సూర్యచంద్రులను పుట్టించిన వాడూ అల్లాహ్‌యే. అవన్నీ తమ తమ కక్ష్యలో తేలియాడు తున్నాయి"** (21:33). దివ్య ఖుర్ఆన్‌లో ఒక రోజును అల్ యౌమ్‌గా 365 సార్లు, మాసాన్ని అల్ షహర్‌గా 12సార్లు ప్రస్తావించడం యాదృచ్ఛికమైన, ఇది దైవాజ్ఞగా గ్రహించవచ్చు. హిజ్రి క్యాలెండర్‌లోని మాసాలు: 1) మొహర్రం 2) సఫర్ 3) రబ్బీయల్ అవ్వల్ 4) రబ్బీవుల్ ధాని 5) జమాది అల్ అవ్వల్ 6) జమాది అల్ ధాని 7) రజ్జబ్ 8) షాబాన్ 9) రమజాన్ 10) షవ్వాల్ 11) జిల్ ఖైదా 12) జిల్‌హజ్. ఉర్దూలో, ప్రాంతీయంగా కొన్ని మాసాలను స్థానిక వాడుకలో నబీసా, దస్తగిరి నెలగా కూడా పిలుచుకోవడం కద్దు.

ముస్లింలు మొహర్రం మాసానికి పవిత్ర మాసంగా భావిస్తారు, కారణమేమంటే కొన్ని చారిత్రక ఘట్టాలు ఈ నెలలోనే సంభవించటమే. మొహర్రం మాసం 10వ రోజు మొదటి ప్రవక్త ఆదం పుట్టుక, స్వర్గ ప్రవేశం. ప్రవక్త నూహ్ ఆయన అనుచరులు నావ నుండి రక్షించబడుట, ప్రవక్త యూనుస్ చేప నుంచి రక్షింపబడుట, ప్రవక్త ఇబ్రాహీం పుట్టుక, దుష్టుడైన నమ్రూద్ రాజుచే అగ్ని గుండంలో విసిరి వేయబడి రక్షింపబడుట, ప్రవక్త మూసా దుష్టుడైన ఫిరౌన్‌ను నీటముంచుట, జకాత్ విధిగా నిర్ణయించబడుట, రెండవ ఖలీఫా ఉమర్ హత్య, హజరత్ ఇమామ్ హుస్సేన్ వీర స్వర్గం అలంకరించుట, ప్రళయం వచ్చే రోజు కూడా ఇదే రోజు కావడం (శుక్రవారం) మచ్చుకు కొన్ని.

మనం మొహర్రం మాసాన్ని ఇస్లామిక్ సంవత్సరంలో ఒక మాసం కన్నా, ధార్మిక పరిజ్ఞాన లోపం వల్ల కేవలం పీర్ల పండుగగా మాత్రమే అత్యధికంగా గుర్తిస్తున్నాము. ప్రతి మొహర్రం పదవ రోజు హజ్రత్ హుసేన్ అమరత్వ గాధ

**ప్రపంచంలో అత్యధికంగా ఉపయోగించేది హిజ్రీ శకం క్యాలండరే! తెలుగు, తమిళ, మలయాళి లాంటి ప్రాంతీయ క్యాలెండర్లు వాడుతున్న, ప్రపంచంలో ఇంచుమించు 145 కోట్ల మంది అంటే ప్రపంచ జనాభాలో 25 శాతం ప్రజలు హిజ్రీ క్యాలెండర్ అమలుతో తమ రోజువారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హిజ్రీ క్యాలెండర్ ఇస్లామిక్ ప్రమాణాల అనుబంధంగా లెక్కిస్తారు కాబట్టి దీన్ని ఇస్లామిక్ క్యాలెండర్‌గా కూడా పిలుస్తారు.**

హృదయాలను కలిచి వేస్తుంది. తన కళ్ళ ఎదుటే తన కుటుంబం బలికావడం, తాను స్వయంగా బలిఅయి వీరస్వర్గం ప్రవేశించటం గొప్ప త్యాగం. ఆ త్యాగానికి, ప్రాణార్పణానికి హజ్రత్ హుసేన్ ఎందుకు సిద్ధమయ్యారు అన్న యదార్థాన్ని గుర్తించాలి. ఇస్లాం చాటిన, తన తాతగారు ముహమ్మద్ ప్రవక్త (స) చూపిన ప్రజాస్వామిక, ప్రజామోదిత ప్రభుత్వ స్థాపనకు తూట్లు పడటం, ఇస్లాం ధర్మ విరుద్ధతను అడ్డుకొనే క్రమంలో హుసేన్ అమరులయ్యారు. ఈ వాస్తవ ఘట్టాలు మన మనోఫలకంపై ముద్రించుకున్నప్పుడు అందరూ మౌనంగా నివాళి అర్పిస్తారు. ఈ స్ఫూర్తి మనలో సంతరించుకున్నప్పుడే ఇస్లాం ధర్మంపై, ముస్లింల సంస్కృతిపై, వస్త్రధారణపై, తిండిపై, దివ్యఖుర్ఆన్‌పై, ప్రవక్తలపై ఇస్లాంఫోబియాతో నిరంతరం జరిగే దాడులను ఎదుర్కొనే స్థైర్యం లభిస్తుంది. మానవ కళ్యాణానికి, దేశ సమైక్యతకు పునరంకితం అవుతూ హిజ్రీ నూతన సంవత్సరాన్ని స్వాగతిద్దాం. ✤


వ్యక్తి సంస్కార,
సంఘ నిర్మాణ,
నైతిక పథకం

గీటురాయి
వారపత్రిక

# మూర్తీభవించిన సంయమనం మూగవోయింది

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

## సయ్యిద్ అబ్దుల్ బాసిత్ అన్వర్ సాబ్

కూడా 'మర్హూమ్'ల జాబితాలో చేరిపోయారు- **'ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్'**. ఇస్లామీయ ఉద్యమాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ముందుకు తీసుకుపోయిన వారిలో అబ్దుల్ బాసిత్ అన్వర్ ముఖ్యులు. 1979 నుండి అవిభక్త తెలుగు రాష్ట్రంలోని జిల్లాల్లో నిర్విరామంగా పర్యటించి 'స్టూడెంట్స్ ఇస్లామిక్ యూనియన్' **(SIU)**ను, 'స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్' **(SIO)**ను విస్తృత ప్రాతిపదికపై పరిచయం చేసి, జమాఅతె ఇస్లామీ హింద్‌కు సెకండ్ లైన్‌ను తయారు చేసి ఇవ్వటంలో తనదైన పాత్రను పోషించిన అరుదైన వ్యక్తి సయ్యిద్ అబ్దుల్ బాసిత్ అన్వర్.

## SIU ప్రెసిడెంట్‌గా

1979 జులైలో హైదరాబాద్‌లోని ఆఫీసర్స్ మెస్ ఫంక్షన్‌హాల్‌లో 'స్టూడెంట్స్ ఇస్లామిక్ యూనియన్' (SIU) ఆవిర్భవించినప్పుడు, ఆయన ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఆనాటి నుండే ఆయన ఆంధ్రప్రదేశ్ అంతటా పర్యటించటం మొదలెట్టారు. అప్పట్లో ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాలు అంతగా లేవు. పలకరించేవారు లేరు. సానుకూలంగా స్పందించేవారూ లేరు. అలాంటి ప్రతికూల పవనాలకు ఎదురీత సాగిస్తూ రాష్ట్రంలో ఎల్లెడలా SIU యూనిట్లను స్థాపించారాయన. తెలుగు ప్రసంగాలు చేయడానికి ఆయనతో కలసి నేనూ ప్రయాణించాను. తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్రలో ఆయన వెంట ఉన్నాను. కాకినాడ వరకూ వెళ్ళాను.




## బహుముఖ కోణాలు

1981 నవంబర్ 16వ తేదీన SIU రాష్ట్ర స్థాయి సదస్సు వరంగల్‌లోని ఇస్లామీయ కాలేజీ గ్రౌండ్‌లో జరిగినప్పుడు ఆయన రెండవసారి రాష్ట్రాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత SIU కాస్తా SIOగా ఏర్పడింది. అప్పటికే అబ్దుల్ బాసిత్ అన్వర్ గారు రాష్ట్రంలోని విద్యార్థుల్లో, యువకుల్లో పాపులర్ నాయకునిగా ఎదిగారు. ఆ తర్వాత ఆయన అంచెలవారీగా జమాఅతె ఇస్లామీ హింద్‌లో వివిధ బాధ్యతలను ఎంతో సంయమనంతో నెరవేర్చారు. అమీరె హల్ఖాగా, కేంద్ర ప్రతినిధి మండలి సభ్యునిగా, రాష్ట్ర సలహా మండలి సభ్యునిగా, శిక్షణా విభాగం జాతీయ సెక్రెటరీగా, తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ డైరెక్టర్‌గా సేవలందించారు. 1993నుండి 2006 వరకు ఏకధాటిగా మూడుసార్లు (మూడు మీఖాత్‌లలో) ఆంధ్రప్రదేశ్ అమీరె హల్ఖాగా ఉన్నారు. ఈ 12 ఏండ్ల కాలంలో జమాఅత్‌కు సంబంధించిన వివిధ డిపార్ట్‌మెంట్లలో- కార్యకర్తలతో కలసి- హ్యూమన్ రిసోర్సెస్‌ని బలోపేతం చేశారు.

జనాబ్ సయ్యిద్ అబ్దుల్ బాసిత్ అన్వర్ గారిది విశిష్ట వ్యక్తిత్వం. ఉద్యమ కార్యకర్తల తల్లో నాలుకగా

ఉండి పని చేశారు. సౌమ్యుడు. నెమ్మదస్తుడు. నగుమోముతో అందరినీ పలకరించేవారు. చాలా చక్కని ఉర్దూ వ్రాసేవారు. నిరాడంబర జీవి. నియమబద్ధుడు.

## కన్న తండ్రి సేవలో

వృద్ధాప్యంలో తల్లిదండ్రుల్లో ఎవరైనా ఒకరిని పొంది, వారి సేవ చేసే ధన్యజీవులను మీరు ఆదర్శంగా తీసుకోవాలనుకుంటే బాసిత్ సాబ్‌ను ఆదర్శంగా తీసుకోవచ్చు. ఆయన తండ్రి సంవత్సరాల తరబడి అస్వస్థతతో మంచం పట్టారు. 1986-89 మధ్య కాలంలో నేను మొగల్‌పురాలోని ఆయన నివాస గృహానికి వెళుతూ ఉండేవాణ్ణి. మంచం మీద ఉన్న తండ్రికి ఆయన చేసే సపర్యలను నేను కళ్ళారా చూసి ఉన్నాను. ఐదేళ్ళ క్రితం ఆయనతో కలసి ఆర్మూర్ ప్రోగ్రామ్‌కు వెళుతున్నప్పుడు, "బాసిత్ భాయి! మీకు మీ నాన్న గారి దుఆలు లభించాయి. మీ నాన్న గారికి మీరు చేసిన సేవల వల్లనేనేమో అల్లాహ్ మీకు గొప్ప అంతస్తులు ప్రసాదించాడ"ని అన్నాను. దానికి ఆయన చిరుమందహాసం చేసి, "కావచ్చు" అన్నారు. మేము ఆర్మూర్ ప్రోగ్రామ్ ముగించుకుని నిజామాబాద్‌కు చేరుకునేసరికి, ఆయనకు కబురందింది- మొగల్‌పురాకు చెందిన ఒక పెద్దాయన చనిపోయారని. హుటాహుటిన ఆయన హైదరాబాద్‌కు బయలుదేరారు. ఇది 2018 నాటి సంగతి. అదే ఆయనతో కలసి నేను చేసిన ఆఖరి పర్యటన.

## నగర ప్రముఖులతో కలసి

బాసిత్ భాయికి హైదరాబాద్‌లోని అనేక ధార్మిక సంస్థలతో అనుబంధం ఉండేది. అనేక సంస్థల, పార్టీల ప్రముఖులతో కలసి ఆయన హైదరాబాద్‌లో రిలీఫ్ వర్క్ చేశారు. ముస్లింల ఐక్య సంఘటనతో కలసి పని చేశారు. వివిధ మత వర్గాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకు వచ్చి, భిన్నాభిప్రాయాలను అకామడేట్ చేసే ప్రయత్నాల్లో పాలుపంచుకున్నారు.

## నిరాడంబర జీవి

ఇంతకుముందు నేను చెప్పినట్లు ఆయన నిరాడంబర జీవి. 1987లో ఒకసారి బాసిత్ భాయి అప్పటి ఎస్ఐఓ ఆలిండియా ప్రెసిడెంట్ పి.సి. హమ్జా గారిని, జోనల్ ప్రెసిడెంట్ హసీబ్ అహ్మద్ గారిని, నన్నూ భోజనానికి ఆహ్వానించారు. ఆ సందర్భంగానే ఆయన తన నివాస గృహంలో తన సోదరుడు యూసుఫ్ గారితో కలసి నడిపే కుటీర పరిశ్రమను చూపించారు. తమ కుటుంబం జరుగుబాటు ఆ పరిశ్రమపైనే ఆధారపడి ఉందని చెప్పుకు వచ్చారు.

సాధారణంగా ఆయన వివాహాది శుభకార్యాలకు ఏ కార్యకర్త ఆహ్వానించినా వెళ్ళేవారు. గీటురాయి ప్రెస్‌లో పనిచేసే రెడ్డి గారు తన కుమారుని పెండ్లికి ఆహ్వానించినప్పుడు పటాన్‌చెరు వరకూ స్టాఫ్ మెంబర్స్‌తో కలసి వెళ్ళి, మ్యారేజ్‌కు అటెండ్ అయ్యారు. అలాగే మరో అసిస్టెంట్ మెషిన్‌మెన్ సమీర్ తన చెల్లి పెండ్లికి ఆహ్వానించినప్పుడు కూడా ఆప్యాయతతో వచ్చి శుభాకాంక్షలు తెలిపి వెళ్ళారు. ఇది ఆయనలోని కలుపుగోలుతనానికి ఒక నిదర్శనం.

## 'ఆఫీసర్స్ మెస్' నుండి 'సఫైర్' వరకు

1979లో మొదటిసారి హైదరాబాద్ మలక్‌పేట్‌లోని ఆఫీసర్స్ మెస్ ఫంక్షన్‌హాల్‌లో మొదలైన ఆయన ఉద్యమ పయనం 2023 ఆగస్టు 15వ తేదీన మలక్‌పేట్‌లోని 'సఫైర్ ఫంక్షన్ హాల్'లో ఉదయం 9.55 గంటలకు 'తజ్కీర్ బిల్ ఖుర్ఆన్'తో ముగిసింది. 45 సంవత్సరాల ధర్మసేవా పయనమిది. పాలసీ ప్రోగ్రామ్ అవగాహనా సదస్సులో అతిథిగా పాల్గొన్న ఆయన ఈ 'తజ్కీర్' కోసం అన్ నాజియాత్ సూరాలోని 34-41 ఆయత్‌లను తీసుకున్నారు. "తన ప్రభువు ముందు నిలబడవలసి ఉంటుందని భయపడి, తన మనస్సును దుష్టవాంఛలకు దూరంగా ఉంచిన వ్యక్తి యొక్క నివాసం స్వర్గమవుతుంది" అంటూ ప్రసంగం ముగించారు. ఇబ్బంది పడుతూనే ప్రసంగించారు. అక్కడి నుండి సరాసరి హాస్పిటల్‌కు వెళ్ళి అడ్మిట్ అయ్యారు. 16వ తేదీ రాత్రి ఒకటిన్నరకు ఊర్ధ్వలోకాలకు సాగిపోయారు. ఆ విధంగా కడదాకా తన పాత్రను దైవమార్గంలో పోషించారు ఈ ధన్యజీవి.


17వ తేదీ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు దారుష్షిఫాలోని జామా మస్జిద్‌లో జరిగిన ఆయన నమాజె జనాజాకు వెయ్యి మందికి పైగా శ్రేయోభిలాషులు, కార్యకర్తలు తెలుగు రాష్ట్రాల నుండి, గ్రేటర్ హైదరాబాద్ నుండి వచ్చి దుఆ చేశారు. ఇటువంటి ముగింపు (ఖాతిమా బిల్ ఖైర్) ఎవరికి ప్రాప్తమయినా అది వారి సౌభాగ్యానికి ఆనవాలు అని భావించాలి. కారుణ్య ప్రభువు ఆయన సేవలను దయతో ఆమోదించి, ఆయన్ని మన్నించి స్వర్గంలో ఉన్నత స్థానాలు ప్రసాదించాలని ప్రార్థన. **(ఆమీన్ యా రబ్బల్ ఆలమీన్)**



# సుబేదార్ నాదిర్ అలీ ఖాన్

## (-1857)

**12**






**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**పరాయి ప్రభువుల పాలన,** పెత్తనాన్ని అంతమొందించేందుకు 1857 నాటి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రస్తుత జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన చాత్రా గ్రామం వద్ద ఈస్ట్ ఇండియా కంపెనీ స్థావరంలో తిరుగుబాటు చేసి ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాలతో తలపడి, తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించిన వీర యోధులు సుబేదార్ నాదిర్ అలీ ఖాన్. ఈస్ట్ ఇండియా కంపెనీ రాంఘర్ బెటాలియన్‌లో ఆయన సుబేదార్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1857 మే 10న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లో స్వదేశీ సైనిక యోధులు ఆంగ్లేయులను తరిమి కొట్టడం ఆరంభించగానే సుబేదార్ నాదిర్ అలీ ఖాన్, ఆయన సహచరులు సుబేదార్ జయమంగళ్ పాండే ఆంగ్లేయాధికారులకు వ్యతిరేకంగా తిరుగుబాటు పతాకాన్ని ఎగుర వేశారు. ఆంగ్లేయాధికారుల ఆజ్ఞలను ధిక్కరిస్తూ అధికారులు, కంపెనీ సైనిక బలగాలకు సవాల్ విసురుతూ సాయుధంగా తిరగబడ్డారు. 1857 అక్టోబర్ రెండున ఈస్ట్ ఇండియా కంపెనీ అనుకూల సైనికులు ప్రథమ భారత సంగ్రామ యోధుల మధ్యన భయానక పోరాటం సాగింది. ఒక గంటపాటు సాగిన ఈ విఖ్యాత పోరాటాన్ని భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర 'చాత్రా పోరాటం'గా నామకరణం చేసింది. చాత్రా గ్రామంలోని 'ఉరిశిక్షల చెరువు'గా పేర్గాంచిన ప్రాంతంలో సాగిన ఈ పోరాటాన్ని సుబేదార్ నాదిర్ అలీ, సుబేదార్ జయమంగళ్ ముందుండి నడిపించారు. ఈ పోరాటంలో అసంఖ్యాక సైనిక బలగం, అపార ఆయుధ సామగ్రి కలిగి, సుశిక్షత అధికారుల మార్గదర్శకం కలిగి ఉన్న ఈస్ట్ ఇండియా కంపెనీ సైనికులది పైచెయ్యి అయ్యింది. ఈ పోరాటంలో మొత్తం మీద 50 మంది ఈస్ట్ ఇండియా అధికారులు, సైనికులు మృత్యువాత పడ్డారు. స్వదేశీ పోరాట వీరులు 150 మంది వరకు ప్రాణాలు అర్పించారు. చాత్రా పోరాట వివరాలను తెలుసుకున్న ఆంగ్లేయ ఉన్నతాధికారులు, ఆంగ్లేయ బలగాలు అన్వేషణ జరిపి అక్టోబర్ 2 రాత్రి లోగా కంపెనీ బలగాల మీద తిరగబడిన స్వదేశీ యోధులను, 'చాత్రా పోరాటం' నాయకులను నిర్బంధించారు. బ్రిటిష్ రాణికి వ్యతిరేకంగా తిరగబడ్డారన్న ఆరోపణల మీద సుబేదార్ నాదిర్ అలీ, సుబేదార్ జయమంగళ్ మీద సైనిక విచారణ నిర్వహించి 1857 అక్టోబర్ మూడున శిక్షలు ప్రకటించారు. ఆ శిక్షల ప్రకారంగా అక్టోబర్ నాలుగున చాత్రాలోని 'ఉరిశిక్షల చెరువు' వద్ద గల మామిడి వృక్షం వద్ద స్వదేశీ పోరాటయోధులు సుబేదార్ నాదిర్ అలీ ఖాన్, అయన సహచరుడు సుబేదార్ జయమంగళ పాండేలకు ఆంగ్లేయులు ఉరిశిక్ష విధించారు. 1857 నాటి ఆ చారిత్రక ఘట్టాన్ని జ్ఞప్తికి తెచ్చేలా చాత్రాలోని 'ఉరిశిక్షల చెరువు' వద్ద ఏర్పాటు చేసిన స్మారక స్థూపం సుబేదార్ నాదిర్ అలీ ఖాన్, సుబేదార్ జయమంగళ్ పాండేల పోరాట స్ఫూర్తిని ఈనాటికీ గుర్తుకు తెస్తుంది. ✤

## ఈ వారం ఫేక్ న్యూస్ రౌండప్

# హర్యానాలో భజరంగ్ దళ్ కార్యకర్తలు కాల్పులు జరపలేదా?





**హర్యానా**లోని నూహ్‌లో ఇటీవల జరిగిన అల్లర్లలో ఒక వివాదాస్పదమైన వీడియో ముందుకు వచ్చింది. తెల్లచొక్కా తొడుక్కున్న ఒక వ్యక్తి రైఫిల్ ఊపుతూ కనిపించాడు. సోషల్ మీడియాలోను, చివరకు జీ న్యూస్ వంటి చానళ్ళలోను ఆ వ్యక్తి పోలీసు అధికారి అని, భజరంగ్ దళ్ కార్యకర్త కాదని చెప్పారు. కాని ఆల్ట్ న్యూస్ నిజనిర్ధారణలో బయటపడ్డ నిజాలు వేరుగా ఉన్నాయి. జీ న్యూస్ ప్రసారంలో ముగ్గురు ఆయుధాలు ఊపుతున్న వీడియో ఉంది. అందులో తెల్లచొక్కా తొడుక్కున్న వ్యక్తి పోలీసు అధికారి అని, హర్యానా ఏడిజీ మమతాసింగ్, ఇతర పోలీసు అధికారులు మామూలు దుస్తుల్లో అక్కడ ఉన్నారని జీ న్యూస్ పేర్కొంది. కాని ఆల్ట్ న్యూస్ పరిశోధనలో ఇద్దరు వ్యక్తులు ఆటోమేటిక్ రైఫిల్స్ చేతపట్టి ఉన్నారు. అలాంటి రైఫిల్స్ సాధారణ పౌరులు ఉపయోగించే అనుమతి లేదు. మూడో వ్యక్తి చేతిలో ఉన్న రైఫిల్ కూడా లైసన్సుతో ఉంచుకోదగిన ఆయుధం. ఈ విషయాన్ని ఏడిజి మమతాసింగ్‌ను ప్రశ్నించినప్పుడు ఆమె తెల్లచొక్కా వ్యక్తి పోలీసు అవునో కాదో చెప్పలేకపోయారు. జీ న్యూస్ నిర్ధారించి చెప్పిన విషయాన్ని అక్కడి పోలీసు అధికారి తనకు తెలియదన్నారు. అంతేకాదు, ఏడిజి మమతాసింగ్ ఆ వ్యక్తి ఎవరో, అతని చేతిలో ఆయుధానికి లైసెన్సు ఉందో లేదో తెలుసుకోవాలని విచారణ ప్రారంభించారు. ఆల్ట్ న్యూస్ విచారణలో అశోక్ బాబా అనే పేరు ముందుకు వచ్చింది. ఆ వైరల్ వీడియోలో ఉంది తానేనని ఇండియా టీవీలో ఈ అశోక్ బాబా చెప్పాడు. తాను గోరక్షకుడినని చెప్పుకున్నాడు. బజరంగ్ దళ్ కార్యకర్తనని కూడా చెప్పుకున్నాడు. అతను భజరంగ్ దళ్ కార్యకర్త అని నిర్ధారణ అయ్యింది. కాని జీ న్యూస్ వంటి చానళ్ళు తప్పుడు వార్తను ప్రసారం చేశాయి. ఇలాంటి ఫేక్ వార్తలను ప్రముఖ టీవీ చానళ్ళు కూడా ప్రసారం చేస్తున్నప్పుడు ఆల్ట్ న్యూస్ వంటి నిజనిర్ధారణ చానళ్ళ అవసరం ఎంత ఉందో తెలుస్తోంది.

ఇక రెండవ వార్తకు వస్తే ప్రధాన మంత్రికి సంబంధించిన వార్త ఇది. మిజోరంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యునికేషన్ తన ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రధాని మోడీ చెప్పుకున్నారు. అగష్టు 10వ తేదీన ఒక ప్రసంగంలో ఆయన ఈ మాటలు చెప్పారు. మిజోరంలో మొదటిసారి తమ ప్రభుత్వమే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యునికేషన్స్ ప్రారంభించిందని చెప్పుకున్నారు. కాని ఇది అబద్ధమని నిజనిర్ధారణలో తేలింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యునికేషన్స్ అధికారిక వెబ్ సైటులో మిజోరంలో ఈ విద్యాసంస్థ అగష్టు 8, 2011న ప్రారంభమయ్యిందని తెలుస్తోంది. అంటే ప్రధాని మన్మోహన్ సింగ్ కాలంలో. డిజిటల్ వార్తా సంస్థలో అసిస్టెంట్ ఎడిటర్‌గా ఉన్న అభినవ్ పాండే కూడా దీన్ని నిర్ధారించారు. అయితే బీజేపీ సమర్థకులు దీనికి జవాబుగా కొత్త క్యాంపస్ 2015లో నిర్మాణం ప్రారంభమయ్యిందని, 2019లో పూర్తయ్యిందని వాదించారు. నిజానికి శాశ్వత కాంపస్, హాస్టళ్ళు పూర్తి కావడం అనేది మార్చి 2022 వరకు జరగలేదు. మొత్తం 25 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దీన్ని నవంబరు 2022న ప్రారంభించారు. కాబట్టి తెలిసినదేమిటంటే మిజోరంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యునికేషన్ అనేది మన్మోహన్ కాలంలోనే పని ప్రారంభించింది. శాశ్వత భవనాల నిర్మాణం ఇప్పుడు జరిగింది.

ఇక మూడవ ఫేక్ వార్త విషయానికి వద్దాం. ప్రమాదంలో మరణించిన వ్యక్తి మరణాన్ని ఆదాయపు పన్నుతో లింకు పెట్టారు. ఒక వాట్సప్ సందేశంలో ఈ వార్త వచ్చింది. ఇది 2018 నుంచి చక్కర్లు కొడుతున్న వార్తే. వార్త ఏమిటంటే, ఎవరైనా వ్యక్తి తన ఆదాయపు పన్ను రిటర్నులు ఖచ్చితంగా చెల్లిస్తున్నట్లయితే, ఆ వ్యక్తి ఒకవేళ ప్రమాదంలో మరణిస్తే మరణానికి ముందు మూడేళ్ళ కాలంలో అతని సగటు ఆదాయానికి పది రెట్లు నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించవలసి ఉంటుందన్నది వార్త. దిక్వింట్ వార్తా సంస్థ నిజనిర్ధారణలో తెలిసినదేమిటంటే, ఈ వార్త పచ్చి అబద్ధం. మోటారు వాహనాల చట్టం 1988 ప్రకారం ఇలాంటి నష్టపరిహారాలేవీ లేవు. 2009 సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం నష్టపరిహారం అనేది అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఈ వాట్సప్ సందేశం ప్రకారం ప్రమాదాల్లో మరణాల నష్టపరిహారానికి ఆదాయ పన్ను రిటర్నులకు ఎలాంటి సంబంధమూ లేదు. ❖

# కన్యాశుల్కంలో ఉర్దూ పద ప్రయోగాలు

**- వాహెద్**




**(గత సంచిక తరువాయి)**

**హిందీ,** ఉర్దూ భాషలు వేర్వేరుగా ఏర్పడడానికి కారకుడు జాన్ బోర్త్ విక్ గిల్ క్రీస్ట్. పర్షియా లిపితో హిందూస్తాని, హిందూయీ, హైందవీ లేదా ఉర్దూ భాషను, దేవనాగరి లిపితో హిందీ భాషను విభజించిన ఘనత ఆయనదే.

ముగల్ కాలంలో, ఆంగ్లేయులు రాకముందు ఉత్తర భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో ప్రజలు మాట్లాడిన మాండలికాలు.. బ్రజ్ భాష, అవధి, మాగధి వగైరా భాషలుండేవి. ఈ భాషల ప్రభావం వల్ల ఏర్పడిందే ఖడీబోలీ. ఇప్పుడు మనం ఉర్దూగా పిలుస్తున్న భాషకు మూలం ఇదే. హిందీ, ఉర్దు భాషల్లో లిపి భేదం మాత్రమే కాదు ఉర్దూ అటు పర్షియన్ నుంచి ఇటు అరబ్బీ నుంచి పదాలను స్వీకరించడమే కాదు కొన్ని వ్యాకరణ సూత్రాలను కూడా తీసుకుంది. సమాస నిర్మాణాలు అటు పర్షియన్ సూత్రాల ప్రకారం, ఇటు అరబీ సూత్రాల ప్రకారం కూడా చేయవచ్చు. ఈ తేడా హిందీకి భిన్నమైనది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్న మాటను హిందీలో ఆంధ్రప్రదేశ్ కీ సర్కార్ అంటాం. ఉర్దూలో పర్షియన్ సమాస సూత్రాలతో హుకుమతె ఆంధ్రప్రదేశ్ అని రాస్తారు. అలాగే పద ప్రయోగాల్లోను తేడా కనబడుతుంది. ఖానా అనే పదం ఉర్దూలో రెండు రకాలుగా ఉచ్ఛరిస్తారు. ఒక ఉచ్ఛారణకు ఇల్లు, నిలయం అని అర్థాలు, రెండవ ఉచ్ఛారణకు తినడం అని అర్థం. దవాఖానా అనేది హిందీలో ఈ ఉచ్ఛారణ భేదాన్ని చూపుతూ రాయలేం. ఇలాంటి తేడాలు ఉండడం వల్లనే హిందీ, ఉర్దూ రెండు వేర్వేరు భాషలుగా స్థిరపడ్డాయి.

చారిత్రకంగా చూస్తే క్రీశ 1253కు చెందిన అమీర్ ఖుస్రో ఉర్దూలో మొదటి దోహాలు రాశాడు. 19 శతాబ్దం ప్రారంభం వరకు ఉర్దూలో రాసిన వాళ్ళు కూడా తమ భాషను హిందూయీ లేదా హైందవీ అనే పిలిచారు.

ముషాఫీ ఫార్సీకో తాక్ పే రఖ్

అబ్ హై అషారె హైందవీ కా రివాజ్

అంటే అర్థం.. ఓ ముషాఫీ ఇక పర్షియన్ భాషను అటకపై పెట్టు, ఇప్పుడు హైందవీ కవితల కాలం వచ్చింది. ఇది ముషాఫీ రాసిన కవిత. ఆయన 1820 కాలంనాటి వాడు. అప్పటికి ఉరుదు లేదు. ఉర్దూ హిందీ అన్న తేడా రాజకీయ కారణాల వల్ల, బ్రిటీషువారి విభజన నీతి వల్ల వచ్చిందే కాని అంతకు మించి కాదు.

హైదరాబాద్ రాష్ట్రంలోని రాజ భాష ఉర్దూ. పరిపాలన ఉర్దూలో జరిగేది. కోర్టులో వాదనలు ఉర్దూలో జరిగేవి. తీర్పులు ఉర్దూలో వచ్చేవి. ఉర్దూలో ఎన్నో న్యాయశాస్త్ర గ్రంథాలు ఉండేవి.

ఉర్దూ, తెలుగూ కలిపి హైదరాబాద్ నగర వాసులు ఎక్కువగా మాట్లాడే వారు.

తెలంగాణలోని తెలుగు భాషలో ఉర్దూ పదాలు ఎన్నో కనిపిస్తాయి. నిజానికి అవి తెలుగుని సంతరించుకున్నాయి. తెలంగాణ భాష మీద ఉర్దూ ప్రభావం ఎక్కువ అనుకుంటారు కాని నిజానికి మొత్తం తెలుగు భాషపైనే ఉర్దూ ప్రభావం ఎక్కువ. తెలుగు వాళ్లు అసంఖ్యాకమైన ఉర్దూ పదాలను తెలుగు పదాలుగా వాడేస్తుంటారు. గుర్తు పట్టడం కూడా ఇప్పుడు కష్టం.

ఉర్దూ విదేశీ భాష కాదు. మొఘల్ కాలంలో సంస్కృతం, ఖడీ బోలీ, వ్రజ్ భాష వంటి పలు భారతీయభాషలలోని పదాలతో క్రమేపీ రూపుదిద్దుకుంది. అక్బర్, తన మంత్రి రాజా మాన్‌సింగ్ సాయంతో తన ఏలుబడిలో వున్న ప్రాంతమంతటిలో లాండ్ రెవెన్యూను స్థిరపరచడంతో, కోర్టు వ్యవహారాలను క్రమబద్ధీకరించడంలో పన్నులకు, కోర్టులకు సంబంధించిన పారిభాషిక పదాలన్నీ ఉర్దూవే అయ్యాయి. అక్బరు తర్వాతి కాలంలో మొఘల్ సామ్రాజ్యం మరింతగా విస్తరించి యిదే విధానం దాదాపు దేశమంతా అమలులోకి వచ్చింది.

ఇక హిందీ భాష ఉర్దూ కంటె వయసులో చిన్నది. 1850ల తర్వాత ఖడీబోలీ భాషలోనే సంస్కృత పదాలు ఎక్కువగా రంగరించి, సంస్కృతం వాడే దేవనాగరీ లిపిలో రాస్తూ ఉర్దూకంటె భిన్నంగా భాష తయారుచేయాలన్న ఉద్యమం ప్రారంభమై హిందీ రూపుదిద్దుకుంది. హిందూస్తానీ అనేది ఉర్దూ మిశ్రితమై, జన సామాన్యం మాట్లాడే భాషగా వుండగా హిందీ అనేది సంస్కృత భూయిష్టమై పండితులు కవిత్వం రాసే భాషగా రూపొందింది. గాంధీ హిందీని ప్రచారం చేస్తూనే, హిందూస్తానీని ఇంగ్లీషు స్థానంలో కామన్ లాంగ్వేజ్‌గా గుర్తింపచేయడానికి ప్రయత్నించాడు. స్వాతంత్ర్యం వచ్చాక అధికార భాషగా హిందీనా? హిందూస్తానీనా దేన్ని గుర్తించాలి అని కమిటీలో చర్చలు జరిగాయి. చివరకు ఒక్క ఓటు తేడాతో హిందీ నెగ్గింది. హిందీ సినిమాల సెన్సారు సర్టిఫికెట్లలో యిదివరలో భాష- 'హిందూస్తానీ' అని రాసేవారు. 'మొఘలే ఆజం' వంటి కొన్ని సినిమాలలో మాత్రం 'ఉర్దూ' అని రాసేవారు. ఇప్పుడు అన్నిటికీ 'హిందీ' అని రాస్తున్నారు. అయినా వాడేది హిందూస్తానీ పదాలే. అచ్చమైన హిందీ అంటే పౌరాణిక టీవీ సీరియల్స్‌లో వాడే భాష!

ఏది ఏమైనా ప్రాచీనత విషయంలో తెలుగు వంటి ప్రాంతీయ భాషలంత పాతవి కావు ఉర్దూ, హిందీ భాషలు. 200 ఏళ్ల క్రితం రాసిన హిందీ పుస్తకం చూపించమంటే వారు నోరు వెళ్లబెడతారు. అవధి, మైథిలీ, భోజ్‌పురి వంటి భాషల్లో కవిత్వం వుంది కానీ ఆ భాషలకు విడిగా అస్తిత్వం వుంది. "రామ్ చరిత మానస్" హిందీ అనుకుంటాం, కాదు, అవధి! దాన్ని హిందీ మాండలికం అని అంటారు. హిందీ వచ్చినంత మాత్రాన హనుమాన్ చాలీసాలో మాటలు ఎన్ని అర్థమవుతాయి? మాండలికం అంటే అసలు భాష వచ్చినవారికి ఓ 5-10% పదాల అర్థం విషయంలో గందరగోళం వుంటుంది. హిందీ మాండలికాలని చెప్పుకునేవాటిలో 75% పదాలు హిందీ వచ్చినా అర్థమే కావు. వాటిని స్వతంత్ర భాషల్లాగానే చూడాలి. వాటికి చాలా శతాబ్దాలుగా అస్తిత్వం వుంది. మైథిలీకి అతి దగ్గరగా వున్న భాషలో విద్యాపతి (1352- 1448) వంటి గొప్ప కవులు వున్నారు. 1954లో హిందీ వ్యాకరణాన్ని స్టాండర్డైజ్ చేయడానికి మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ కల్చర్ పూనుకుని కమిటీ వేసింది. వాళ్లు 1958లో "ఏ బేసిక్ గ్రామర్ ఆఫ్ మోడర్న్ హిందీ" అని వేశారు. కాబట్టి హిందీ తర్వాతి భాష. ఉర్దూలో హిందీలా కనిపించే పదాలు నిజానికి అవధీ, భోజ్ పురి, మైథిలి, తదితర భాషలనుంచి వచ్చాయి.

అసలు ఉర్దూ భాషయే అనేక భాషల సంగమం.అందులో తెలుగు పదాలు కూడా చాలా ఉన్నాయి. దక్షిణాదిన మాట్లాడే ఉర్దూలో బండి అన్న పదం యథాతథంగా అలాగే ఉర్దూలో వాడతారు. ప్రముఖ ఉర్దూ కవి మక్దూం రాసిన గొప్ప కవిత ఏక్ చమేలీకే మండ్వే తలే లో మండ్వా అన్న పదం మండువా తెలుగు నుంచి తీసుకున్నదే. తెలంగాణ మాండలికంలో కాస్త పెన్ను ఇస్తావా అని అడగడానికి జర నీ కలమియ్యరాదే అంటారు. ఇది ఉర్దూ ప్రభావం. తెలుగు ప్రభావంతో ఉర్దూ వాక్యనిర్మాణంపై కూడా ఇక్కడ ప్రభావం పడింది. తెలుగు విభక్తులు కి, కు, రా వంటివి ఉర్దూపై ప్రభావం వేశాయి. కైకూ, కిస్కూ, కైకూకీ, మేరేకూ, తుమ్హారేకూ, కైసా హై రే, కతే వంటి పదాలు తెలుగు ప్రభావం వల్ల వచ్చినవే. దక్కనీ ఉర్దూలో సంస్కృతం నుంచి వచ్చిన తత్సమ రూపాలు కూడా చాలా ఉన్నాయి. మేఘ్, ఆకాశ్, జగ్, ముఖ్, చంద్ర్, గగన్, సకల్, కిరణ్, రూప్, సహజ్, సేవక్, మాయా, మోహ్, సూర్య్, దుఖ్, సుఖ్, దిన్, రాత్, ముక్త్, దేహ్, నైన్ వగైరా అనేక పదాలు సంస్కృతం నుంచి ఉర్దూ స్వీకరించింది. ఇలాంటి పదాలు తెలుగులో అంతకు ముందే సంస్కృతం నుంచి వచ్చి ఉండవచ్చు. ఎందుకంటే తెలుగు భాష ఉర్దూ కన్నా చాలా ప్రాచీనమైన భాష. కాని ఈ పదాలు హిందీ పదాలని భావించడం పొరబాటు. అవి సంస్కృత, ప్రాకృత భాషల నుంచి వచ్చిన పదాలు. ఉర్దూ కూడా ఆయా పదాలను స్వీకరించింది. ఇదంతా చెప్పడమెందుకంటే భాషల మధ్య ఆదాన ప్రదానాల వల్ల భాషలు సుసంపన్నమవుతాయి. తెలుగు భాష ఉర్దూ పదాలను కలుపుకోవడం వల్ల సుసంపన్నమయ్యింది. **(ఇంకా వుంది...)**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**53 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 42. అష్ షూరా

13 ఆయన మీ కొరకు నిర్దేశించిన ధర్మ విధాన ఆదేశమే నూహ్‌కు ఇచ్చాడు, దాన్ని (ముహమ్మద్!) ఇప్పుడు నీ వద్దకు మేము వహీ ద్వారా పంపాము; దానినే మేము ఇబ్రాహీమ్, మూసా, ఈసాకు బోధించి ఉన్నాము, స్థాపించండి ఈ ధర్మాన్ని, అందులో విభేదించుకోకండి[20] అన్న గట్టి నిర్దేశనతో. (ముహమ్మద్!) దేని వైపునకు నీవు వీరికి పిలుపు నిస్తున్నావో ఆ విషయమే ఈ బహుదైవారాధకులకు తీవ్రంగా అయిష్టకరమయినది. అల్లాహ్ తాను కోరిన వానిని తన వానిగా చేసుకుంటాడు; తన వద్దకు చేరే దారినీ ఆయన, తన వైపునకు మరలేవారికే చూపిస్తాడు.

**(20వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

ఆ తరువాత ధర్మానికి పోలిన ఈ చట్ట నిర్మాణం, నూహ్‌కు, ఇబ్రాహీమ్‌కు, మూసా, ఈసా (అలైహిముస్సలామ్)కు ఇవ్వబడిన మార్గబోధన వంటిదే. దానినే ఇప్పుడు మహనీయ ముహమ్మద్ (స)కు అందజేయబడిందని సెలవియ్యబడింది. ఈ ప్రవచనం వల్ల ఎన్నో విషయాలు ముందుకు వస్తాయి. ఒకటి, అల్లాహ్ తన ఈ చట్ట నిర్మాణాన్ని నేరుగా ప్రతి మానవుని వద్దకు పంపలేదు. అప్పుడప్పుడు ఆయన ఉచితమని భావించి నప్పుడల్లా, ఒక వ్యక్తిని తన సందేశహరునిగా నియమించి ఈ చట్ట నిర్మాణాన్ని అతనికి అప్పగించాడు. రెండవది, ఈ ధర్మం (చట్టనిర్మాణం) తొలి నుంచీ ఒక్కటే. ఏదో ఒక కాలంలో ఏదో ఒక జాతికి ఒక ధర్మం నిర్ణయించడం మరో కాలంలో మరో జాతికి మరో ధర్మం, దానికి భిన్నమయిన ధర్మం, దానికి విరుద్ధ మయిన ధర్మం పంపడం అంటూ ఎన్నడూ జరగలేదు. దైవం అనేక ధర్మాలు పంపలేదు. దైవం పక్షాన ఎప్పుడు వచ్చినా ఒకే ధర్మం వచ్చింది. మూడవది, అల్లాహ్ నాయకత్వాన్ని, ప్రభు సత్తాను అంగీకరించిన తరువాత దానితో పాటే ఈ చట్ట నిర్మాణం ఎవరిచేత పంపబడిందో వారి దైవ దౌత్యాన్ని అంగీకరించడం, ఈ చట్టనిర్మాణం వివరించబడిన వహీని నమ్మడం ఆ ధర్మంలోని అనివార్యమయిన అంశమయి ఉండాలి. బుద్ధి, హేతువు కూడా అదే చెబుతాయి; ఎందుకంటే ఈ చట్ట నిర్మాణం దైవం తరఫున ప్రామాణికం (Authentic) అని తృప్తికరంగా నమ్మనిదే దాన్ని మనిషి అనుసరించడం సాధ్యపడదు.

ఆ తరువాత సెలవీయబడిందేమిటంటే, ఈ ప్రవక్తలందరికీ ధర్మం వంటి ఈ చట్ట నిర్మాణం ఈ నిర్దేశన ఈ తాకీదు చేసి మరీ ఇవ్వబడింది: "ఈ ధర్మాన్ని స్థాపించండి." ఈ పదాలను షాహ్ వలీయుల్లాహ్ (రహ్మ) "ధర్మాన్ని స్థాపించండి" అని అనువదిం చారు. షాహ్ రఫీయుద్దీన్ (రహ్మ), షాహ్ అబ్దుల్ కాదిర్ (రహ్మ) "ధర్మాన్ని స్థాపితంగా ఉంచండి" అని అనువదించారు. ఈ రెండు అనువాదాలూ సరయినవే. ఇకామత్ అంటే అర్థం స్థాపించడం అనీ, స్థాపితంగా ఉంచాలనీ రెండూ వస్తాయి. దైవ ప్రవక్తలకు ఈ రెండు బాధ్యతలూ అప్పగించబడ్డాయి. మొదటి విధి, ఈ ధర్మం స్థాపితం లేనిచోట దాన్ని స్థాపించడం. రెండవ విధి, ఇది స్థాపించిన చోట లేదా ముందే స్థాపితమయి ఉన్నచోట దాన్ని స్థాపితంగా నిలబెట్టడం. ఒక వస్తువును స్థాపితంగా నిలబెట్టడం అంటే దాన్ని స్థాపించిన తరువాతనే సాధ్యం. లేకపోతే మొదట దాన్ని స్థాపించాలి, తరువాత నిరంతరం ప్రయత్నం కొనసాగించి దాన్ని సుస్థాపితంగా ఉంచవలసి ఉంటుంది.

ఇక మన ముందు రెండు ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. ఒకటి, ధర్మాన్ని స్థాపించడమంటే ఉద్దేశం ఏమిటి? రెండు, స్థాపించాలని, స్థాపితంగా కాపాడాలని ఆదేశమివ్వబడిన ఆ ధర్మం లేదా దీన్ అంటే అసలు భావం ఏమిటీ? ఈ రెండు విషయాలనూ క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి.

**"కాయిమ్"**(స్థాపన) అనే పదం ఏదయినా భౌతికమయిన, ఆకారం గల వస్తువును గురించి ప్రయోగించినప్పుడు దాని ఉద్దేశం కూర్చున్న వారిని లేపడం అని వస్తుంది. ఉదాహరణకు మాన వుణ్ణి లేదా జంతువును లేపడం. లేదా పడి ఉన్న వస్తువును నిలబెట్టడం, ఉదాహరణకు బొంగును లేదా స్తంభాన్ని నిలబెట్టడం. లేదా చిందువందరయి పడి ఉన్న అంశాలను ప్రోగుచేసి ఎత్తుగా పేర్చడం. ఉదాహరణకు ఖాళీ స్థలంలో ఒక కట్టడాన్ని నిలబెట్టడం. కాని భౌతికం కాని భావపరమయిన విషయాలను గురించి స్థాపించడం (కాయిమ్) అనే పదం ప్రయోగించినట్లయితే దాని భావం కేవలం దాన్ని ప్రచారం చేయడం అని రాదు. దాన్ని పరిపూర్ణంగా అమలుపరచడం, దాన్ని ప్రచలితం చేయడం, దాన్ని క్రియాత్మకంగా ఆచరణలో పెట్టడం అని అర్థం వస్తుంది. ఉదాహరణకు మనం ఫలానా వ్యక్తి తన ప్రభుత్వాన్ని స్థాపించాడు అని అంటే దాని భావం, అతను తన ప్రభుత్వం వైపునకు ప్రజల్ని ఆహ్వానించాడు అని రాదు.

**(20వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

**216)** యహ్యా బిన్ సయీద్ ఖత్తాన్, ఇబ్నె మెహ్దీలిద్దరూ వివరించారు: షుబా తమతో ఇలాగే చెప్పారని కూడా అన్నారు– "దైవప్రవక్త(సఅసమ్) ఏదయినా విషయాన్ని చెడుగా భావించినప్పుడు, ఆయన(స) ముఖారవిందంపై దాని ప్రభావం వ్యక్తమయ్యేది."

**217)** హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: మహాప్రవక్త(సఅసమ్) ఎన్నడూ ఏ భోజనంలో కూడా లోపాన్ని ఎత్తి చూపలేదు. ఒకవేళ అది తనకు ఇష్టమైనదై ఉంటే తినేవారు. లేకపోతే వదలిపెట్టేసేవారు."

**219)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం: "ప్రవక్త మహనీయులు (సఅసమ్) దుఆయె ఇస్తిస్ఖా (వర్షం కొరకు చేసే వేడుకోలు) తప్ప మరే దుఆలోనూ తన చేతుల్ని అంత పైకి లేపేవారు కారు. ఈ దుఆలో ఆయన(స) తన చేతుల్ని ఎంత పైకి లేపారంటే, ఆయన చంకలలోని తెల్లదనం కానరాసాగింది"– హజ్రత్ అబూ మూసా ఇలా అన్నారు: "ఒకసారి దైవప్రవక్త(స) దుఆ చేస్తూ తన చేతుల్ని ఎత్తారు. నేను ఆయన(స) రెండు చంకల తెల్లదనాన్ని చూశాను."

**220)** ఔన్ బిన్ అబీ జుహైఫాగారు తన తండ్రి (అబూ జుహైఫా– రజి) నుండి ఉటంకించేవారు : నేను (అబూ జుహైఫా) ప్రయాణం చేసే ఉద్దేశ్యంతో దైవ ప్రవక్త(సఅసం) సన్నిధిలో హాజరయ్యాను. అప్పుడు ఆయన(స) అబ్తహ్ (ముహస్సబ్)లో తన గుడారం లోపల ఉన్నారు. మిట్ట మధ్యాహ్న సమయం. అంతలో బిలాల్(రజి) బయటకు వచ్చి నమాజ్ కొరకు అజాన్ ఇచ్చి, లోపలికి వెళ్ళిపోయారు. దైవప్రవక్త(స) వుజూ కొరకు ఉపయోగించగా మిగిలిన నీరును హజ్రత్ బిలాల్(రజి) బయటకు తీయగా, జనులు దానికోసం ఎగబడ్డారు. తరువాత బిలాల్(రజి) ఒక ఈటెను తీసుకున్నారు. దైవప్రవక్త(స) బయటకు ఏతెంచారు. ఆ సమయంలోని ఆయన(స) పిక్కల మెరుపు కూడా నా కళ్ళముందరే ఉంది. బిలాల్ (సుత్రాగా) ఈటెను పాతి పెట్టారు. ఆయన(స) జుహ్ర్, అస్ర్ నమాజులు రెండేసి రకతుల చొప్పున ఖసర్ చేశారు. ఆ సమయంలో గాడిదలు, స్త్రీలు ఆయన ముందు నుండి (సుత్రా అవతలి నుంచి) సాగిపోతూ ఉన్నాయి.[1]

## అధ్యాయం : 23

## దైవప్రవక్త(స) కళ్ళు బాహ్యంలో నిద్రించేవి. కాని హృదయం మాత్రం ఏమరుపాటుకు గురయ్యేది కాదు

దీనిని సయీద్ బిన్ మీనా గారు జాబిర్(రజి) నుండి ఉటంకించారు. జాబిర్ (రజి) గారు దైవప్రవక్త(స) నుండి ఉల్లేఖించారు.

**222)** అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ కథనం: ఈయన హజ్రత్ ఆయిషా (ర.అ)ను, '(అమ్మా!) రమజాన్ మాసంలో దైవ ప్రవక్త(సఅసం) ఆచరించే తరావీహ్ లేదా తహజ్జుద్ నమాజ్ వైనం ఎటువంటిది?' అని అడిగినప్పుడు, ఆమె ఇలా వివరించారు: "రమజాన్ నెలలో అయినా, మరే ఇతర నెలలోనయినా దైవప్రవక్త(స) పదకొండు రకతుల కన్నా ఎక్కువగా చేసేవారు కారు (వాటిని తహజ్జుద్ అంటారో, తరావీహ్ అంటారో మీ ఇష్టం). మొదట ఆయన(స) నాలుగు రకతుల నమాజ్ ఆచరించేవారు. ఆ రకతులు ఎంత సుదీర్ఘంగా, మరెంత చక్కగా ఉండేవంటే, వాటి చక్కదనాన్ని గురించి ఇక అడగకండి. ఆ తరువాత మరో నాలుగు రకతులు చేసేవారు. ఆ నాలుగు రకతులు కూడా ఎంత సుదీర్ఘంగా, సుందరంగా ఉండేవంటే, వాటి సౌందర్యం గురించి ఏమని చెప్పేది? ఆ తరువాత ఆయన(స) మూడు రకతుల విత్ర్ నమాజ్ ఆచరించేవారు. 'దైవప్రవక్తా! మీరు విత్ర్ నమాజ్ చేయక ముందు ఎందుకు నిద్రపోతారు?' అని నేనడిగితే, 'నా కళ్ళు నిద్రిస్తాయి. కాని నా హృదయం మేల్కొనే ఉంటుంది' అని ఆయన(స) అన్నారు".

220-1. దైవప్రవక్త(స) నమాజ్ చేస్తున్నప్పుడు, ఆయన ముందు ఈటెను 'సుత్రా'గా పాతటం జరిగింది. అధ్యాయంలోని ప్రధానాంశం ఇదే. ఆయన(స) కాళ్ళ పిక్కలు ఎంతో అందంగా, ప్రకాశవంతంగా ఉండేవి.



# ఒకరికొకరు దుస్తుల వంటివారు

రూహి

**ఈ శీర్షిక అర్థమేమిటో తర్వాత చెబుతాను. ముందు కొన్ని వార్తలు చూద్దాం.**

గత మార్చిలో వచ్చిన వార్త ప్రకారం భారతదేశంలో గృహహింస కేసులకు సంబంధించి కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ నివేదికను విడుదల చేసింది. విమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2022 సర్వే పేరుతో విడుదల చేసిన ఈ నివేదికలో గృహహింస కేసుల జాబితాలో 50.4% తెలంగాణ రెండవ స్థానంలో ఉందని షాకింగ్ విషయాన్ని వెల్లడించింది. 75% గృహహింస కేసులతో అస్సాం రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచింది. ఆపై తెలంగాణ రాష్ట్రం 50.4 శాతం గృహింస కేసులతో రెండవ స్థానంలో, 48.9%తో ఢిల్లీ మూడవ స్థానంలో నిలిచాయి.

గతంలో సుప్రీంకోర్టు గృహహింస చట్టం, అదే 498ఏ దుర్వినియోగాన్ని నివారించడానికి కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఫిర్యాదు రాగానే అరెస్టు చేయరాదని, ఒక కమిటీకి ఫిర్యాదు పంపి, ఆ నివేదిక వచ్చిన తర్వాతే చర్యలు ప్రారంభించాలని చెప్పింది. ఐపిసి 498ఏ చట్టం దుర్వినియోగం గురించి చాలా కాలంగా చర్చ జరుగుతూనే ఉంది. భార్యాబాధిత సంఘాలు ఈ విషయమై విమర్శలు సంధిస్తూనే ఉన్నాయి. మరోవైపు స్త్రీవాదులు ఈ చట్టాన్ని సమర్థిస్తూ మాట్లాడుతూనే ఉన్నారు.

నిజం చెప్పాలంటే ఐపిసి 498ఏ కోరలు పీకే కార్యక్రమం ఎప్పటి నుంచో మొదలైంది. నెమ్మదిగా కొనసాగుతోంది. తప్పుడు కేసులు వేస్తున్నారని, మనోవర్తి పెద్దమొత్తంలో రాబట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఇలా రకరకాల ఆరోపణలు చాలా వినిపిస్తున్నాయి. ఈ సెక్షను కింద కేసుల్లో శిక్షలుపడిన శాతం చాలా తక్కువ. కాబట్టి ఈ కేసులు చాలా వరకు తప్పుడు కేసులే అని తీర్మానించేవారు కూడా ఉన్నారు. కాని పరిశోధనాధికారులు తగిన శ్రద్ధ చూపకపోతే, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తగిన శ్రద్ధ చూపకపోతే కోర్టుల్లో శిక్షలు పడే అవకాశాలు కూడా ఉండవు కదా. కాబట్టి శిక్షలు పడిన శాతం తక్కువైనంత మాత్రాన కేసులన్నీ తప్పుడు కేసులే అనడం కూడా సరికాదు. అలా అని ఈ చట్టం దుర్వినియోగం కాలేదని కూడా చెప్పలేం. భర్తను, అత్తమామలను వేధించడానికి కేసులు వేసిన వారు కూడా ఉండొచ్చు. ఆ మాట కొస్తే దేశంలో దుర్వినియోగం కాని చట్టమంటూ ఏదన్నా ఉందా? ఇంతకుముందు వ్యాసంలో పరువునష్టం కేసులు ఎలా ఎందుకు వేస్తున్నారో చెప్పుకున్నాం. రెవిన్యూ చట్టాలు దుర్వినియోగం

కావడం లేదా? దుర్వినియోగమవుతున్న చట్టాలు చాలానే ఉన్నాయి. కాని ప్రతి చట్టం విషయంలో ఇలాంటి చర్చ జరగడం లేదు.

విచిత్రమేమంటే, 498ఏ చట్టం చాలా కఠినంగా ఉన్న రోజుల్లోను భార్యని చావబాదేవాళ్ళు తమ పని కొనసాగించారు. చట్టం ఎంతవరకు ఆ దుర్మార్గాలను అడ్డుకుందో లెక్కలు తీసి చెప్పే వాళ్ళు ఎవరూ లేరు. కేవలం చట్టం చేసినంత మాత్రాన సమస్య పరిష్కారం అవుతుందంటే అంతకన్నా హాస్యాస్పదం మరేదీ ఉండదు. ముఖ్యంగా ఇలాంటి సమస్యల్లో సామాజిక ఆలోచనాసరళి మారవలసిన అవసరం ఉంది.

పెండ్లాం బెల్లాం తల్లి దయ్యం, పెండ్లాం బెల్లం ముక్క తల్లి మట్టిగడ్డ లాంటి సామెతలు మనకున్నాయి. ఆలి వైపు వారు ఆత్మబంధువులైరి, తల్లి వైపు వారు తగిన పాటి, తండ్రి వైపు వారు దాయాదులైరయా వగైరా పద్యాలు కూడా చాలా మంది చదివి ఉంటారు. ఇవన్నీ చూస్తే, పెండ్లి తర్వాత మగవాడు భార్యకు దాసోహం అయిపోతాడన్న ఒక భావన కలిగేలా ఉన్నాయి. అది నిజమా?

అది నిజం కాదన్న సంగతి ప్రతిరోజు మనకు కనబడుతూనే ఉంటుంది. భార్యను కొట్టడం అనే అనాగరికమైన చర్య చాలా మామూలు విషయం. వేధింపులు, సతాయింపులు సమాజంలో నిత్యం చూస్తూనే ఉన్నాం. అంటే చెప్పుకోడానికి, జోకులేసుకోడానికి మాత్రమే పెండ్లాం బెల్లం అంటున్నారు కాని నిజానికి పెండ్లాం అంటే స్వంత ఆస్తి ఇష్టమొచ్చినట్లు వాడుకోవచ్చన్న భావనే బలంగా ఉంది.

తల్లి ప్రేమ గురించి సెంటిమెంటల్ గా చెప్పే మాటలు మనం చాలా వింటాం. మాతృదేవోభవ వగైరా ఉపదేశాలు కూడా వింటాం. పతియే ప్రత్యక్ష దైవం వంటి మాటలు కూడా వింటాం. కాని అలాంటి మాటలే భార్య గురించి ఎందుకు వినడం లేదు? ఎందుకు చెప్పుకోవడం లేదు? సామాజిక ఆలోచనా సరళిలో మార్పు రావాలంటే ఇలాంటి మాటలను వెదికి వాటిని ప్రచారంలో పెట్టాలి.

అలాంటి ప్రయత్నమే క్రింది మాటలు.

ఇస్లామ్ మతం ప్రకారమే కాదు, క్రయిస్తవ, యూద మతాల ప్రకారం కూడా ప్రపంచంలో మొట్టమొదటి మానవసంబంధం కేవలం ఆలుమగల సంబంధం మాత్రమే. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, కొడుకులు, కూతుళ్ళు... ఈ సంబంధాలన్నీ తర్వాత వచ్చిన సంబంధాలే. అన్నింటికన్నా ముందు, ప్రప్రథమ మానవ సంబంధం. అనుబంధం భార్యభర్తలదే. ఈ మూడు ప్రధాన మతాలు ఈ విషయాన్ని ఒప్పుకుంటాయి. ఎలాగంటే, ఈ మూడు మతాలూ ఆదమ్ తొలి మానవుడిగా భావిస్తాయి. కొన్ని ఇస్రాయీలీ రిఫరెన్సుల ప్రకారం, తొలి మానవుడు ఆదమ్‌ను మట్టితో చేసిన దేవుడు 40 సంవత్సరాల వరకు ఆయన్ను ప్రాణం లేకుండా అలాగే వదిలేశాడట. ఇస్లామ్, క్రయిస్తవ రిఫరెన్సుల ప్రకారం కూడా తొలి మానవుడు ఆదమ్ కు ప్రాణం పోసిన వెంటనే దేవుడు ఆయనకు జంటను సృష్టించలేదు. ఆయన్ను ఒంటరిగానే స్వర్గంలో ఉండమన్నాడు. స్వర్గంలో ఉన్నప్పటికి ఒంటరిగా ఉన్న ఆదమ్ సంతోషంగా లేరు. ఉల్లాసంగా లేరు. చాలా నిరీక్షణ తర్వాత సంతోషాన్ని, ఉల్లాసాన్ని, శాంతిని కలుగజేసేలా దేవుడు ఒకరోజు ఆయనకు జంటగా హవ్వాను సృష్టించాడు. ఆదమ్ ఒకరోజు నిద్ర నుంచి మేల్కొనే సరికి ఆయన ముందు ఆయన జంట, ఆయన భార్య హవ్వ ఉంది.

ఈ ధార్మిక గ్రంథాలు చెప్పే మానవ సృష్టి క్రమంలో తొలి మానవుడు సుదీర్ఘకాలం నిరీక్షించిన తర్వాత మాత్రమే లభించిన అపురూప వరం భార్య. ఈ వాస్తవాన్ని ఎందుకు మనం ప్రచారం చేయలేకపోతున్నాం. భార్య ఒక అపురూపమైన వరం అన్న వాస్తవాన్ని భర్తలకు అర్థమయ్యేలా ఎందుకు చెప్పలేకపోతున్నాం.

ఖుర్‌ఆన్‌లో రూమ్ అధ్యాయంలో ఆసక్తికరమైన వాక్యాలున్నాయి. దేవుడు మనిషిని మట్టితో సృష్టించాడని చెప్పిన వెంటనే తర్వాతి వాక్యంలో మాటలు గమనించదగినవి. "ఆయన సూచనలలో మరొకటి ఏమంటే, ఆయన మీ కొరకు భార్యలను మీ జాతి నుంచే సృష్టించాడు. మీరు వారి వద్ద శాంతిని పొందడానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్ని సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలున్నాయి"

ఈ వాక్యంలో గమనించవలసిన విషయమేమంటే, భార్యాభర్తల సంబంధాన్ని దేవుడు తన సూచనగా చెప్పడం. మొత్తం ఖుర్‌ఆన్ గ్రంథంలో మరో బాంధవ్యాన్ని దేన్ని కూడా దేవుడు తన సూచనగా చెప్పలేదు. తల్లిదండ్రుల పట్ల ఉత్తమంగా వ్యవహరించాలన్న వాక్యాలున్నాయి. తల్లిదండ్రులను గౌరవించాలని ఉపదేశాలు న్నాయి. కాని తన సూచనగా ఒక బాంధవ్యాన్ని గుర్తించడం అన్నది లేదు. కేవలం భార్యాభర్తల సంబంధం తప్ప. పై వాక్యంలో మీ జాతి నుంచే భార్యలను సృష్టించడం అన్నది ఇస్లామీయ గ్రంథాల అవగాహన లేనివారికి కాస్త విచిత్రంగా కనిపించవచ్చు. కాని అక్కడ ఆ వాక్యానికి అర్థం మానవజాతిలోని పురుషులకు, మానవజాతికి చెందిన స్త్రీనే జంటగా చేశామన్నది. దేవుడు తలచుకుంటే మరో ప్రాణిని నీ జంటగా చేయగలిగే ఉండేవాడే అని చెప్పడం. ఈ బాంధవ్యంలో మూడు ముఖ్యమైన విషయాలను ప్రస్తావించాడు.

ఒకటి శాంతిని పొందడం. రెండు ప్రేమ, మూడు కారుణ్యం. శాంతి అన్న పదం అనువాదంలో వాడారు కాని అసలు పదం సుకూనత్ అంటే ఒక ప్రశాంతచిత్తం, ఎలాంటి అలజడి లేని హాయి. కేవలం భార్యాభర్తల సంబంధంలోనే అది లభిస్తుందని చెబుతూ, ప్రేమ, కరుణ అనే రెండు పదాలను వరుసగా ఉపయోగించడానికి కారణాలు కొందరు వ్యాఖ్యాతలు వివరించారు. పెళ్ళయిన కొత్తలో, వయసులో ఉన్నప్పుడు ఆలుమగల మధ్య లైంగికసంబంధం వారి మధ్య బలమైన ప్రేమకు పరాకాష్ఠగా అవుతుందని, వయసు మళ్ళిన తర్వాత శరీరం శక్తులుడిగిన తర్వాత కూడా ఈ ప్రేమ ఒకరి పట్ల మరొకరు కరుణాపూరితంగా వ్యవహరించేలా చేస్తుందని వివరించారు.

ఈ బాంధవ్యంలోని ఈ గొప్పదనాన్ని ఇప్పుడు వివరణాత్మకంగా ఎందుకు ప్రచారం చేయడం లేదు? ఇదేదో పవిత్రసంబంధం కాదు. ఇది ప్రేమకారుణ్యాల సంబంధం. ఇక్కడ ప్రేమ అన్నది ఏదో అలౌకికమైన ప్రేమ కాదు. ఇది మనిషి సహజమైన లైంగిక ఆకర్షణ వల్ల జనించిన ప్రేమ, ఆ ప్రేమే తర్వాత ఒకరి పట్ల మరొకరిలో కరుణార్ద్రమైన భావనగా మారుతుంది. భార్యాభర్తల సంబంధం పవిత్ర బంధం అంటూ ఆచరణకు సాధ్యం కాని దైవత్వమూ దానికి కల్పించనవసరం లేదు. ఇది మానవీయమైన సంబంధం. మనుషుల మాదిరిగా కలిసి ఉండవలసిన బాంధవ్యం. ప్రేమకరుణల సంబంధం. దాని గురించి గొప్పగా చెప్పుకోవాలి.

పైన చెప్పిన ఖుర్‌ఆన్ అధ్యాయంలో దేవుడు తన సృష్టిలో తన ఉనికికి సంబంధించిన సూచనలను తెలియజేశాడు. రాత్రిపగలు, భాషలు, యాసలు, శరీరవర్ణాలు, భూమ్యాకాశాలు, మెరుపులు, వర్షం కురిసి నేలపై పచ్చిక ప్రాణం పోసుకోవడం వీటన్నింటిని ప్రస్తావిస్తూ, అదే వరుసలో భార్యాభర్తల సంబంధాన్ని ప్రస్తావించాడన్నది గమనించాలి. తన ఉనికిని గుర్తించే సూచనల్లో భార్యాభర్తల సంబంధం, అందులోని ప్రేమ, కరుణ, వీటన్నింటిని స్వయంగా దేవుడే ప్రస్తావిస్తుంటే మతానుయాయులు దానికి ఎంతగా నిబద్ధులు కావాలి.

భార్య తనతో బాగుంటే తాను కూడా భార్యతో చక్కగా వ్యవహరించడంలో సామరస్యం ఏముంది? ఇమామ్ గజాలీ చెప్పిన ఒక మాట ఈ సందర్భంగా గమనించదగింది. తలబిరుసు, అవిధేయత, తిరస్కారంతో వ్యవహరించే భార్య పట్ల సహనం, ఓర్పు ప్రదర్శించిన భర్త ప్రళయదినాన నోవా, లూత్ ప్రవక్తలతో పాటు ఉంటాడని చెప్పారాయన. అలాగే దుర్మార్గం, తలబిరుసు, తిరస్కారంతో వ్యవహరించే భర్త పట్ల సహనం చూపిన భార్య హజ్రత్ ఆసియా (ఫారో భార్య)తో పాటు ఉంటుందని చెప్పారు.

ఈ మాటల అంతరార్థం భార్యాభర్తలు ఒకరి పట్ల ఒకరు సహనం, ఓర్పు కలిగి ఉండాలన్నది. ఒకరి మాటతీరు, వ్యవహారశైలి నచ్చకపోయినా సర్దుకుపోవాలన్నది. కేవలం భార్యకు మాత్రమే బోధించలేదు. భర్తకు కూడా బోధించడం జరిగింది. నిజానికి భర్తకే ముందు చెప్పడం జరిగింది. తర్వాత భార్యను కూడా ఈ బోధనలో కలిపారు.

మనం ముందు చెప్పుకున్నట్లు ధార్మికంగా ఆలోచిస్తే ప్రపంచంలో మొట్టమొదటి బాంధవ్యం ఆలుమగల సంబంధం. అలాగే చిట్టచివరి వరకు నిలబడే బాంధవ్యం కూడా ఇదే. ఖుర్‌ఆన్ ఈ విషయంలో స్పష్టంగా పుణ్యాత్ములైన భార్యాభర్తల జంటను అలాగే స్వర్గంలో కొనసాగిస్తారని ప్రకటించింది. అంటే ఇదొక్కటే శాశ్వతమైన సంబంధం. మరో విషయమేమంటే, ప్రవక్త ముహమ్మద్ హదీసు ప్రకారం ఆదమ్‌ను సృష్టించిన తర్వాత దేవుడు ఆయనకు జంటగా హవ్వాను ఆదమ్ ఎడమ పక్కటెముకతో సృష్టించాడని చెప్పారు. ఈ హదీసుకు వ్యాఖ్యాతలు వివరణ ఇస్తూ, స్త్రీ స్థానం హృదయానికి దగ్గరగా ఉందని, అందువల్లనే ఎడమ పక్కటెముకతో సృష్టించాడని అన్నారు. ఈ సందర్భంగా గమనించవలసిన మరో విషయం ఏమంటే ప్రవక్త ముహమ్మద్ చెప్పిన మరో హదీసు ప్రకారం "స్త్రీల పట్ల కరుణతో వ్యవహరించండి. స్త్రీ పక్కటెముకతో చేయబడింది. పక్కటెముక వంకరగా ఉంటుంది. దాన్ని తిన్నగా చేయాలని ప్రయత్నిస్తే విరిగిపోతుంది. అలాగే ఉంచితే వంకరగానే ఉంటుంది. కాబట్టి కరుణతో వ్యవహరించండి.'' ఈ మాటలకు వివరణ ఇస్తూ వ్యాఖ్యాతలు చెప్పిన మాటలు గమనించాలి. భర్త అనుకున్నట్లు భార్య ఉండడం, అలాగే వ్యవహరించడం కూడా జరక్కపోవచ్చు. ఆమె తన ఇష్టం వచ్చినట్లే ఉంటుంది. ఆమె మాటలు ఒక్కోసారి అతన్ని బాధించనూ వచ్చు. ఈ హదీసు కేవలం భర్తలను మాత్రమే ఉద్దేశించింది కాదు, తండ్రి, అన్న, తమ్ముడు, మామ వగైరా బంధువులైన పురుషులందరినీ ఉద్దేశించినది. కాబట్టి స్త్రీ మాటలు, చేతలు ఏవైనా బాధించినా ఆమెను సరిచేయాలని ప్రయత్నించి విరిచేయకండి అని చెప్పడం జరిగింది.

మరో హదీసు ప్రకారం ప్రవక్త ముహమ్మద్ ఒకసారి మాట్లాడుతూ "భార్య పట్ల ఉత్తమంగా వ్యవహరించేవాడే మీలో ఉత్తముడు" అన్నారు. ఈ మాటలు ముస్లిములెందరు పాటిస్తున్నారో ఆత్మవిమర్శ చేసుకోవలసిన అవసరం ఉంది. ప్రవక్త ముహమ్మద్ తమకు ఆదర్శమని ప్రకటించుకునే ప్రతి ముస్లిమ్ గమనించవలసిన వాస్తవమేమంటే, ప్రవక్త ఇంటిపనుల్లో సహాయపడేవారు, పిండి కలిపేవారు, తన దుస్తులకు తానే కుట్లు వేసుకునేవారు, తన చేతులతో భార్యకు తినిపించేవారు, భార్యతో పరుగుపందెం

వేసేవారు. ఎంతమంది నేడు ఇంటి పనుల్లో సహాయపడు తున్నారు? ఎంతమంది భార్యకు మానసికోల్లాసం కలిగేలా బయట తీసుకెళ్ళడం, సరదాగా పందెం వేసుకోవడం వంటివి చేస్తున్నారు. ఇంకా గట్టిగా చెప్పాలంటే ఒకే పాత్రలో నీళ్ళతో భార్యాభర్తలు కలిసి స్నానం చేసేవారు. భార్యాభర్తల మధ్య బాంధవ్యాన్ని బలపరిచే ఈ మాటలు ఎంతమంది పాటిస్తున్నారు.

పెళ్ళి చేసుకున్న తర్వాత భార్య ప్రయివసీని ఎంతమంది గుర్తిస్తున్నారు. ఉమ్మడి కుటుంబం అన్న భావన ఇస్లామ్ లో లేదు. కాని విచిత్రమేమంటే ఇప్పుడు అదో గొప్ప నైతిక విషయమై పోయింది. ఒకరికి ఒకరు సహాయపడుతూ అందరూ కలిసిమెలిసి ఉండే ఉమ్మడి కుటుంబం మంచిదే. కాని ఇప్పుడలా ఉందా? అత్తమామల సూటిపోటి మాటలు, మరదళ్ళకు, మరుదులకు సేవలందించే మెషీన్ లా ఇంటికొచ్చిన కోడలిని మార్చడం జరగడం లేదా? పెళ్ళయిన తర్వాత ప్రత్యేకంగా వేరే ఇంట్లో పెట్టాలన్నది ఇస్లామీయ బోధనల్లో ఉన్న విషయమే. అంత స్తోమత లేకపోతే అందరూ కలిసి ఉంటున్నప్పటికీ భార్యాభర్తలు ప్రత్యేకంగా ఒక గది, వంటిల్లు కలిగి ఉండాలి. అదీ సాధ్యం కాకపోతే కనీసం ప్రత్యేకంగా ఒక గది ఇచ్చే స్తోమత అన్నా ఉండాలి. ఆ స్తోమత కూడా లేకపోతే పెళ్ళి చేసుకోరాదు. మీలో స్తోమత ఉన్నవాళ్ళు వెంటనే వివాహం చేసుకోవాలి, స్తోమత లేనివారు ఉపవాసాలు పాటించడం ద్వారా తమ కోరికలను అదుపులో ఉంచుకోవాలని ప్రవక్త చెప్పారు. అంటే పెళ్ళి చేసుకోడానికి స్తోమత అన్నది షరతు, మగవాడికి వర్తించే షరతు. ఆ షరతుకు అనుగుణంగా ఉన్నప్పుడే పెళ్ళి చేసుకోవాలి. లేకపోతే ఉపవాసాలు పాటిస్తూ కోరికలను అదుపు చేసుకోవాలి అంతే తప్ప స్తోమత లేకపోయినా పెళ్ళి చేసుకుని ఒక అమ్మాయి గొంతు కోయడం తగిన పని కాదు.

ఎందుకంటే భార్యాభర్తల సంబంధం సమాజానికి పునాది వంటిది. సమాజంలో శాంతిశ్రేయాల చల్లని నీడ కొనసాగాలంటే ఈ సంబంధంలో సంతోషం ఉల్లాసాలు ఉండాలి. మరో హదీసులో ప్రవక్త చెప్పిన మాటలు కూడా ఇక్కడ గమనార్హమైనవి. షైతాను ప్రతిరోజు దర్బారు నిర్వహిస్తాడట. తన అనుచరులను అడుగు తాడట. ఈ రోజు మీరు సాధించింది చెప్పండని. ఒక్కో అనుచరుడు తాను ఫలానా మనిషిని ఫలానా దుర్మార్గం చేసేలా ప్రోత్సహించానని, తప్పుదారి పట్టించానని ఇలా చెబుతున్నప్పటికీ షైతానుకు సంతోషం కలుగదు. మీరంతా ఏమీ గొప్ప పని చేయలేదు అంటుంటాడు. చివరకు ఒక అనుచరుడు లేచి, దొర, నేను ఒక భార్యాభర్తల జంటలో మనస్పర్థలు పెంచి వాళ్ళు విడిపోయేలా చేశానంటాడు. ఆ వెంటనే షైతాన్ వాడిని పిలిచి చాలా గొప్ప పని చేశావు అని కావలించుకుంటాడు. అంటే మానవాళిని నాశనం చేయాలనుకునే షైతానుకు భార్యాభర్తల సంబంధం తెగిపోవడం అన్నది ఎంతో సంతోషకరమైన విషయం. ఎందుకంటే, ఈ సంబంధం తెగిపోతే సమాజం పునాదులు కదులుతుంటాయి. భవిష్యతరాల బతుకులు నాశనమవు తుంటాయి.

ఇస్లామ్‌ను పాటిస్తామనుకునే ముస్లిములందరూ గమనించ వలసిన వాస్తవాలివి.

ఇవన్నీ ఏవో ధార్మిక విషయాలని పక్కన పెట్టవచ్చు. కాని ఇవి సమాజానికి దిశా నిర్దేశం చేసే విషయాలుగా కూడా గమనించాలి.

చివరిగా ఈ వ్యాసానికి శీర్షికగా పెట్టిన విషయం. ఇది ఖుర్ఆన్ లోని ఒక వాక్యం:

"వారు (భార్యలు) మీకు దుస్తులు. మీరు వారికి దుస్తులు" (అల్ బఖర్ 187)

భార్యాభర్తల సంబంధాన్ని ఖుర్ఆన్ వర్ణించిన తీరిది. దుస్తులకు మనిషి శరీరానికి మధ్య స్పేస్ మరేదీ ఉండదు. అలాంటి సాన్ని హిత్యం భార్యాభర్తల మధ్య ఉండాలని, వారి మధ్య రహస్యాలు ఉండరాదని, సుఖదుఃఖాలన్నీ సమానంగా ఉండాలని, దుస్తులు శరీరాన్ని వాతావరణం నుంచి కాపాడినట్లు ఒకరినొకరు కాపాడాలని, శరీరంలో లోపాలను దుస్తులు కప్పినట్లు భార్యాభర్తలు ఒకరి లోపాలను మరొకరు కప్పిపెడుతూ ఒకరికి ఒకరుగా ఉండాలని, దుస్తులు మనిషికి అందాన్నిచ్చినట్లు ఒకరికి ఒకరు అందాన్ని ఆహ్లాదాన్ని ఇస్తూ ఉండాలన్నది దానికి భావం.

ఇవన్నీ కుటుంబం, భార్యాభర్తల సంబంధాలకు సంబంధించిన విషయాలు. నేను ఎక్కువగా ఇస్లామీయ గ్రంథాలనే ఉటంకించాను. ప్రారంభంలో క్రయిస్తవ, యూద రిఫరెన్సు ఒక్కటే ఇచ్చాను. నాకు అవగాహన ఉన్న విషయాలివి మాత్రమే కాబట్టి వీటి గురించి మాట్లాడాను. హిందూధర్మంలో ఇలాంటి విషయాలు చాలా ఉండవచ్చు. వాటి గురించి తెలిసిన వారు రాయాలి. ప్రపంచంలో జనాభా అత్యధిక శాతం మతావలంబికులు కాబట్టి మతాలు ఈ విషయంలో బోధించే మంచి మాటలను ప్రచారంలో పెట్టడం వల్ల ఆలోచనాసరళిలో మార్పులు వచ్చే అవకాశాలున్నాయి. కేవలం చట్టాలు చేయడం వల్ల మార్పులు రావు. ఆలోచనా సరళిలోను మార్పులు రావాలి. చట్టం దుర్వినియోగమై పోతుందంటూ దానిని నీరుకార్చడం వల్ల కూడా ప్రయోజనం లేదు. దుర్వినియోగం కాని చట్టం అంటూ ఏదీ లేదని కూడా గుర్తించాలి.




ఈ ఏడాది ప్రారంభంలో ఒక ఆసక్తికరమైన వార్త వచ్చింది. దేశ వ్యాప్తంగా నాగలి పడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోందని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ బ్యాంక్ (నాబార్డ్) వెల్లడించింది. మహిళా రైతుల సంఖ్య పెరుగుతోంది కాబట్టి వారికి అనువైన వ్యవసాయ యంత్రాలను తయారు చేయాలని కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు సూచించింది.

కొంతకాలం క్రితం మహిళా రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రతిపాదన ఏదన్నా ఉందా? అనే ప్రశ్న పార్లమెంటులో వచ్చింది. అలాంటి గుర్తింపు కార్డులిస్తే మహిళా రైతులు కూడా సేద్యం చేస్తున్నట్లు గుర్తింపు పొందుతారు. అలాంటి కార్డులు ఇస్తున్నారా, ఇస్తుంటే ఆ వివరాలు చెప్పండి, ఇవ్వడం లేదంటే ఎందుకు ఇవ్వడంలో లేదో చెప్పండి? అనే ప్రశ్నలు పార్లమెంటులో వచ్చాయి. అప్పుడు పార్లమెంటులో మంత్రిగారి జవాబు ఏమిటంటే, 2011 జనాభా లెక్కల ప్రకారం 3కోట్ల 60 లక్షల మంది మహిళలు సేద్యం చేస్తున్నట్లు ఇప్పటికే గుర్తింపు పొందారు కాబట్టి ప్రత్యేకంగా మహిళా రైతులకు గుర్తింపు కార్డులిచ్చే ప్రతిపాదన ఏదీ లేదు.

ఈ ప్రశ్నలో అడిగిన విషయానికి, మంత్రిగారు చెప్పిన సమాధానానికి తేడా ఉంది. మహిళలు ఉపాధి కోసం సేద్యం చేస్తున్నారు, అలా జనాభా లెక్కల్లో కూడా తెలిసింది. ఈ గుర్తింపు గురించి కాదు ప్రశ్న, మహిళలు రైతులుగా గుర్తింపు లేకపోవడం వల్ల కోల్పోతున్న ప్రయోజనాలు, రైతులుగా గుర్తింపు లేనందువల్ల ఎదురవుతున్న సమస్యల గురించిన ప్రశ్న అది. కాని మంత్రిగారు మాత్రం జనాభా లెక్కల్లో మహిళలు వ్యవసాయం చేస్తున్నట్లు తెలిసింది కాబట్టి గుర్తింపు కార్డులు అవసరం లేదన్నారు. అడిగిన ప్రశ్నకు, ఇచ్చిన జవాబుకు సంబంధమే లేదు.

గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను మనం నిశితంగా గమనించవలసి ఉంటుంది. పురుషులు ఉద్యోగాల కోసం పట్టణాలకు తరలిపోతున్నారు. పొలాల్లో పనిచేసే బాధ్యత కుటుంబాల్లోని స్త్రీలు తమ భుజాలపై వేసుకుంటున్నారు. నిజానికి దేశంలో వ్యవసాయ పనుల్లో ఉన్న వారిలో 65 శాతం మహిళలే అని గణాంకాలు చెబుతున్నాయి. వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర చాలా ఎక్కువ.

మంత్రిగారు జవాబులో 3 కోట్ల 60 లక్షల మంది మహిళలు జనాభాలెక్కల్లో వ్యవసాయం చేస్తున్నట్లు గుర్తించడం జరిగింది ఇంకేమీ చేయనవసరం లేదు అన్నట్లు మాట్లాడారు. జనాభా లెక్కల్లో వ్యవసాయం చేస్తున్నట్లు తెలిస్తే సరిపోతుందా? మహిళా రైతులు ఎదుర్కుటున్న సమస్యలు జనాభా లెక్కల్లో మేం వ్యవసాయ పనులు చేస్తున్నాం అని రాయించినంత మాత్రాన

పరిష్కారమైపోతాయా? జనాభా లెక్కల్లో ఉపాధికార్యకలాపాల్లో వ్యవసాయం చేస్తున్నట్లు రాసినా వారికి వచ్చే ప్రయోజనం ఏదీ లేదు. అది కేవలం సేద్యం పనులు చేస్తున్న మహిళల లెక్క తెలుసుకోడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. దాని వల్ల రైతులుగా వారికి గుర్తింపు రాదు. రైతులుగా వారికి లభించవలసిన ప్రయోజనాలు, హక్కుల కోసం ప్రశ్నించనూ లేరు.

రైతులు, రైతుకూలీలు, కౌలురైతులు ఈ పదాల మధ్య తేడా ఉంది. కౌలు రైతుకు సొంత భూమి ఉండదు. ఇతరుల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తాడు. రైతుగా అతనికి గుర్తింపు ఉండదు. ప్రభుత్వం రైతుగా గుర్తించాలంటే భూమి యాజమాన్యం ఉండాలి. కాబట్టి 3 కోట్ల 60 లక్షల మంది మహిళలు జనాభా లెక్కల్లో వ్యవసాయం చేస్తున్నట్లు తెలిసినా వారంతా ప్రభుత్వం దృష్టిలో రైతులుకాదు. భూమి యాజమాన్యం లేకపోతే ప్రభుత్వం రైతుగా గుర్తించదు. ఇక్కడ సమస్య ఏమంటే, దేశంలో 87 శాతం మహిళలకు భూమి యాజమాన్యం లేదు. వారు వ్యవసాయ పనులు చేసే సేద్యగాళ్ళు (Cultivators) గానే ఉంటారు. అంటే వారు వ్యవసాయ భూమిలో సేద్యం చేసేవారు మాత్రమే. దీనివల్ల ఏమవుతుందంటే చాలా మంది మహిళలు సేద్యపు పనులు చేస్తున్నప్పటికీ రైతులకు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ స్కీములేవీ ఉపయోగించుకోలేరు. వారు వ్యవసాయ రుణాలు పొందలేరు. సబ్సిడీలు పొందలేరు. ఆక్స్ ఫామ్ ఇండియా 2017లో జారీ చేసిన నివేదిక ప్రకారం ఈ ఆంక్షలు, పరిమితుల వల్ల మహిళల వ్యవసాయోత్పత్తులు చాలా దెబ్బతింటున్నాయి. నష్టపోతున్నారు.

2011 జనాభా లెక్కల తర్వాత 2012లో మహిళా రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి గురించి, ఆత్మహత్యల గురించి ఎన్డీటీవీ రిపోర్టు వచ్చింది. అప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వైయస్సార్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతు అంటే ఎవర్నది నిర్వచించడానికి, రైతు ఆత్మహత్యలంటే ఏమిటో తెలుసుకోడానికి ప్రయత్నించింది. 2004లో జారీ అయిన ప్రభుత్వ ఉత్తర్వు జి.ఓ.నెం.421 ప్రకారం వ్యవసాయ భూమి యాజమాన్యహక్కు ఉన్న వారే రైతులు. ఈ నిర్వచనం ప్రకారం రైతుగా గుర్తింపు పొందిన కుటుంబాల్లో ఆత్మహత్య జరిగితేనే రైతు ఆత్మహత్యగా గుర్తించి నష్టపరిహారం ఇస్తారు. సేద్యం చేసే మహిళలు, భూమి లేని రైతు కూలీలు ఈ నిర్వచనం పరిధిలోకి రారు. 2011లో ఆంధ్రప్రదేశ్‌లో 90 రైతు ఆత్మహత్యలు జరిగినట్లు ప్రభుత్వ లెక్క. కాని మీడియా, ఇతర సంస్థల క్షేత్రస్థాయి పరిశోధనలో ఈ సంఖ్య మూడు నాలుగింతలు ఎక్కువగా ఉన్నట్లు తెలిపాయి.

అక్టోబర్ 2011లోనే రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో సర్వే జరిగితే ఆ ఒక్క నెలలోనే 95 ఆత్మహత్యలు ముందుకు వచ్చాయి. ప్రభుత్వం చెప్పే 90 ఆత్మహత్యలన్నది చాలా తక్కువ. ఇందులో రైతుకూలీలు, మహిళలను పరిగణనలోకి తీసుకోలేదు. కాని ఈ ఆత్మహత్యలు కూడా వ్యవసాయ నష్టాల కారణంగానే జరిగాయి. కాని వీరి పేరిట భూమి లేదు. అందువల్ల రైతులుగా గుర్తింపు లేదు.

ఎన్డీటీవీలో వచ్చిన మరో విషాదకరమైన వార్త ఏమంటే, యాదయ్య అనే రైతు భార్య ఆత్మహత్య చేసుకుంది. స్థానిక రెవిన్యూ అధికారి నష్టపరిహారం లభించదని చెప్పేశాడు. ఎందుకంటే ఆమె పేరిట భూమి లేదు. నష్టపరిహారం పొందడానికి రైతు అని చెబుతారా అంటూ మండిపడ్డాడు. పైగా నువ్వు చచ్చిపోతే రైతుగా నీ కుటుంబానికి నష్టపరిహారం వస్తుంది కాని మీ భార్య చనిపోతే రాదనేశాడు.

మహిళా రైతులను గుర్తించడానికి కార్డులు ఇవ్వాలన్న ప్రతిపాదన కొత్తదేమీ కాదు. విమెన్ ఫార్మర్స్ ఎంటైటిల్ మెంట్ బిల్లు 2011 రాజ్యసభలో ప్రవేశపెట్టింది వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్. దేశంలో హరిత విప్లవానికి కారకుడు. ఈ బిల్లులో మహిళా రైతు సర్టిఫికేట్ల ప్రస్తావన కూడా ఉంది. ఈ సర్టిఫికేటు ద్వారా సేద్యం చేసే మహిళను రైతుగా గుర్తించడం జరుగుతుంది. దీనివల్ల మహిళారైతు ప్రభుత్వ స్కీములను ఉపయోగించుకోవడం సాధ్యపడుతుంది. కిసాన్ క్రెడిట్ కార్డు పొందవచ్చు. వ్యవసాయరుణం పొందే అవకాశం ఉంటుంది. ఈ అవకాశాలు మహిళలకు లేవు. ఎందుకంటే వారి పేర భూమి ఉండదు.

మహిళా రైతులకు గుర్తింపు కార్డులు అవసరమని స్వామినాథన్ గట్టిగా చెప్పారు. సామాజిక కార్యకర్త రీమా నానావతి కూడా గుర్తింపు కార్డులు ఇవ్వాలని బలంగా వాదిస్తున్నారు. పురుషులు పట్టణాలకు వలసపోవడం వల్ల మహిళలే ఇప్పుడు వ్యవసాయం చేస్తున్నారు. 2011 జనాభా లెక్కల్లో మహిళలు వ్యవసాయం చేస్తున్నట్లు గుర్తించినంత మాత్రాన వారికి రైతులుగా గుర్తింపు రాలేదు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ విమెన్ స్టడీస్ అధ్యక్షురాలు, ఎకనమిస్ట్ రీతూ దివాన్ ప్రకారం గ్రామాల్లోని భూమి రికార్డుల్లో మహిళల భూమి హక్కును గుర్తించడం ద్వారా ఆమెకు రైతుగా గుర్తింపు వస్తుందని అంటున్నారు. అంటే ప్రత్యేకంగా గుర్తింపు కార్డు అవసరం లేదు. ఎకనమిస్ట్ బినా అగర్వాల్ 1994లో రాసిన 'ఏ ఫీల్డ్ ఆఫ్ వన్స్ ఓన్' పుస్తకంలో ఈ

సమస్యను చర్చించారు. మహిళలకు భూమిపై హక్కు లేకపోవడం వల్లనే ఆమెకు నిర్ణయాధికారాలు కూడా లభించడం లేదని అన్నారు.

భారత ప్రభుత్వం మహిళలకు భూమి హక్కు లభించేలా చేయడానికి తీసుకున్న చర్యలు కూడా చాలా ఉన్నాయి. 9వ పంచవర్ష ప్రణాళికలో భూపంపిణీకి ప్రాముఖ్యం ఇచ్చారు. దున్నేవాడికే భూమి ఇవ్వాలని అన్నారు. అందులో 40 శాతం భూమి మహిళల పేరిట, మిగిలిన భూమి భార్యాభర్తల పేరిట ఉమ్మడిగాను పంపిణీ చేయాలని చెప్పారు. 10వ పంచవర్ష ప్రణాళికలో మహిళలు ఆస్తి కొంటున్నప్పుడు వారికి రాయితీలు ఇచ్చారు. 2005లో హిందూ వారసత్వ చట్టాన్ని సంస్కరించి మహిళలకు ఆస్తిహక్కు ఇచ్చారు. 2009లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా స్వయం సహాయక గ్రూపులకు భూమి లీజుకు ఇచ్చే కార్యక్రమం నడిపింది. కాని ఇప్పటికీ గ్రామాల్లో మహిళలకు భూమిపై హక్కు తక్కువే. ల్యాండ్ రికార్డులను అప్ డేట్ చేయడం ద్వారా వారికి ఈ హక్కు కల్పించవలసిన అవసరం ఉంది.

సాధారణంగా పురుషాధిక్య సమాజంలో మహిళలకు భూమిపై హక్కు లభించడం చాలా కష్టం. 2011 జనాభా లెక్కల్లో చాలా మంది మహిళలు వ్యవసాయం చేస్తున్నట్లు తెలిసినా ప్రభుత్వ నిర్వచనం ప్రకారం వారు రైతులు కాదు. రైతులుగా వారికి లభించవలసిన హక్కులు లభించవు. రుణాల రద్దు, పంట ఇన్సూరెన్సు, సబ్సిడీలు ఏవీ లభించవు. ఈ సమస్యల పట్ల ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ❖

## మౌనం వదలన్న మోడీ- మోడీ మౌనంపై పార్లమెంటులో హంగామా



ఇటీవలి పార్లమెంటు సమావేశాల్లో ప్రధాని మోడీ మణిపూర్ విషయంలో మాట్లాడడానికి ఇష్టపడకపోవడంతో చివరకు ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. మణిపూర్ లో దిగజారిన పరిస్థితి, చాలా మంది దీన్ని అంతర్యుద్ధంగా పోలుస్తున్న పరిస్థితిపై ప్రధాని మాట్లాడడానికి ఇష్టపడకపోవడంతో పార్లమెంటులో ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. పార్లమెంటులో ప్రధాని మాట్లాడేలా చేయడానికి ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం తీసుకువచ్చాయి. మూడు నెలలుగా మణిపూర్ తగలబడుతున్నప్పటికీ నోరిప్పని ప్రధానితో మాట్లాడించడమే ఈ అవిశ్వాస తీర్మానం ముఖ్య లక్ష్యం. కాని పార్లమెంటులో చివరకు మాట్లాడిన ప్రధాని దాదాపు రెండున్నరగంటల ప్రసంగంలో కేవలం కొన్ని నిముషాలు అది కూడా ఖచ్చితమైన హామీలు లేని మాటలు మణిపూర్ గురించి చెప్పారు. అది కూడా ప్రతిపక్షాలు వాకౌట్ చేసిన తర్వాత మాత్రమే. మణిపూర్‌లో శాంతి స్థాపించడం జరుగుతుందని చివరకు ప్రధాని చెప్పిన మాటలు నమ్మశక్యంగా లేవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు, ఎందుకంటే ప్రధాని తన ప్రసంగంలో ప్రతిపక్షాలను విమర్శించడం, హేళన చేయడం, జోకులేయడంతోనే గడిపారు. మణిపూర్ సమస్య నుంచి దృష్టి మళ్ళించడమే ప్రధానంగా ఆయన ప్రసంగం సాగింది. టెలిగ్రాఫ్ పత్రిక ప్రముఖంగా మోడీ ప్రసంగాన్ని The record-breaking blah-sphemy: PM Modi speaks for 2 hours and 13 minutes in the Lok Sabha అని రాస్తూ, క్రింద కేవలం బ్లా.. బ్లా... బ్లా... అనే పేరాలు రాసింది. ఒక ప్రధాని ప్రసంగాన్ని ఈవిధంగా రిపోర్టు చేయడం అనేది బహుశా మరెక్కడా జరిగి ఉండదు. ప్రతిపక్షాలు వాకౌట్ చేసిన తర్వాత మాత్రమే మణిపూర్ గురించి క్లుప్తంగా ప్రధాని ప్రస్తావించారు. చెప్పిన మాటలు కూడా గట్టి చర్యలకు సంబంధించినవి కావు. ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మెయిటీలు, కుకీలకు మధ్య హింసాకాండలో దాదాపు 180 మంది మరణించారు. వేలాది మంది శిబిరాల్లో కాలం గడుపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా మోడీ ఈ సమస్యకు ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. హోంమంత్రి అమిత్ షా మణిపూర్ గురించి మాట్లాడినప్పటికీ విమర్శలను తగ్గించలేకపోయారు. అవిశ్వాస తీర్మానం వీడిపోతుందని అందరికీ తెలుసు. అయితే ఇండియా కూటమి మొత్తం వాకౌట్ చేయడం మోడీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఒక్కటయ్యాయనడానికి నిదర్శనం. ఈ అవిశ్వాస తీర్మానంలో ప్రభుత్వ విజయం కన్నా ఎక్కువగా మణిపూర్ సమస్యపట్ల మోడీ సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనంగా చరిత్రలో గుర్తుండిపోతుంది.




# హర్యానాలో బుల్‌డోజర్ రాజకీయాలు భారత రాజకీయాల్లో పెరుగుతున్న దమననీతి

**నూహ్** ఒక చిన్న పట్టణం. ఆర్థికంగా కూడా కుదేలుపడిన పట్టణం. హర్యానాలో ఉన్న ఈ చిన్న పట్టణం అల్లర్ల తర్వాత విషాదానికి మారుపేరుగా మారింది. టైమ్ మ్యాగజైనులో వచ్చిన కథనం ప్రకారం మూడు రోజులపాటు అధికారులు దాదాపు వంద ఇండ్లను, దుకాణాలను బుల్‌డోజర్లతో కూల్చేశారు. ఈ కూల్చివేతల్లో ధ్వంసమైన ఆస్తులన్నీ దాదాపుగా ముస్లిములవే. జనాభా లెక్కలు 2011 ప్రకారం నూహ్ జిల్లాలో 77 శాతం ముస్లిం జనాభా ఉంది. టైమ్ మ్యాగజైను ప్రకారం ముస్లిముల ఆస్తులు, ఇండ్లు, దుకాణాలను బుల్‌డోజర్లతో కూల్చడం అనేది ఇప్పుడు బీజేపీ రాజకీయ నాయకుల చేతుల్లో న్యాయవ్యవస్థకు అతీతమైన రాజకీయ ఆయుధంగా మారింది. రాజనీతి శాస్త్రవేత్త అలీఖాన్ మహ్మూదాబాదీ టైమ్ మ్యాగజైనుతో మాట్లాడుతూ బీజేపీ నేతలు చట్టాన్ని అతిక్రమించడానికి బుల్ డోజర్లను ఆయుధంగా వాడుకుంటున్నారని అన్నాడు. హర్యానా హెూం మంత్రి అనిల్ విజ్ అగస్టు 3వ తేదీన హింసాకాండలో పాల్గొన్న వారికి వ్యతిరేకంగా బుల్డోజర్లు కూడా పరిష్కార సాధనాలుగా మారతాయని చెప్పాడు. అధికారులు చెప్పేది ఏమిటంటే, అక్రమంగా కట్టిన కట్టడాలను కూల్చేస్తున్నామని అంటున్నారు. కాని చాలా మంది ఇండ్ల యజమానులు, దుకాణా యజమానులు దీన్ని ఖండిస్తున్నారు. ఆలోచించవలసిన విషయమేమిటంటే, ఖట్టర్ ప్రభుత్వం సుదీర్ఘకాలంగా హర్యానాలో అధికారంలో ఉంది. ఇన్ని సంవత్సరాలుగా అక్రమ నిర్మాణాలు కనబడలేదా? కనబడలేదంటే అది ఖట్టర్ ప్రభుత్వం అత్యంత అసమర్థ ప్రభుత్వమని చెప్పడానికి ఉదాహరణ అవుతుంది. ఇప్పుడే ఎందుకు ఈ అక్రమ నిర్మాణాలన్న వాదన వచ్చిందంటే ముస్లిములను శిక్షించడానికి దీన్ని ఒక సాకుగా వాడుకుంటున్నారన్నది స్పష్టంగా అర్థమవుతోంది. పంజాబ్ హర్యానా హైకోర్టు దీనిపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం ఎథినిక్ క్లీన్సింగ్ అంటే జాతి హత్యాకాండకు పూను కుంటుందా అని వ్యాఖ్యానించింది. ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని జాతి హత్యాకాండకు పాల్పడుతున్నారా అని ఒక ఉన్నత న్యాయస్థానం నిలదీయం దేశంలో గతంలో ఎన్నడూ జరగలేదు. ఇదే మాట టైమ్ మ్యాగజైను కూడా రాసింది. బీజేపీ రాజకీయాలను అడ్డుకోడానికి న్యాయస్థానం తీసుకున్న గొప్ప నిర్ణయంగా పేర్కొంది. టైమ్ మ్యాగజైను భారతదేశంలో ఈ బుల్డోజరు రాజకీయాల చరిత్రను కూడా రాసింది. 1992 బాబరీ మస్జిదు కూల్చివేతను ప్రస్తావిస్తూ ఆ సంఘటన తర్వాత భారత రాజకీయాల్లో వచ్చిన మార్పులను పేర్కొంది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ వంటి వారు బుల్డోజరు రాజకీయాలతో పైకెదగాలనుకుంటున్నారు. అన్ మోల్ గుప్తా అనే న్యాయవాది టైమ్ మ్యాగజైనుతో మాట్లాడుతూ ఈ కూల్చివేతల్లో చట్టం పట్ల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. 2019లో పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనల్లోను బుల్డోజర్లను బెదిరింపు సాధనాలుగా వాడారు. టైమ్ మ్యాగజైను ప్రకారం 2020 మార్చి నుంచి 2021 జులై వరకు 43 వేల ఇండ్లు ధ్వంసం చేశారు. ప్రతి గంటకు సగటున 21 మంది నిర్వాసితులయ్యారు. కొన్ని సందర్భాల్లో కోర్టులు జోక్యం చేసుకుంటున్నప్పటికీ కోర్టులు జోక్యం చేసుకోక ముందే నష్టం జరిగిపోతోంది. ఇది నూహ్ కు మాత్రమే సంబంధించిన సమస్య కాదు చాలా పెద్ద సమస్య అని టైమ్ రాసింది. ఈ బుల్డోజర్ రాజకీయాలు చాలా మంది ముస్లిములను తీరని నష్టానికి గురి చేశాయని పేర్కొంది. ఈ రాజకీయాలు పౌరుల ఆస్తి హక్కును ధ్వంసం చేయడమే కాదు, చట్టబద్ధ పాలన, సమానత్వం, మతసామరస్యాలు దిగజారిన పరిస్థితికి నిదర్శనమని రాసింది.



- తస్నీమ్‌జహాన్ ఖాన్

# బకాసురులు

**అమీన్** వాళ్ళ ఫ్యామిలీ తిండి తినటంలో మహా ఆసక్తి కలిగి ఉంటారు. ఎప్పుడూ ఏదో ఒకటి నములుతూ నోరు ఆడిస్తూనే ఉండేవారు. ఎక్కడికెళ్ళినా ముందుగా ఆహార పదార్థాలపైనే దృష్టి సారించేవారు. చాట్ మసాలాలు, పిజ్జాలు, బర్గర్‌లు, స్వీట్లు, పునుగులు, గారెలు, సమోసాలు, బిస్కెట్లు, చాక్లెట్లు, కూల్ డ్రింకులు, మోక్ టైళ్ళు, పానీపూరీలు, కేక్‌లు, నూడుల్స్ ఒకదాని తర్వాత ఒకటి గ్యాప్ లేకుండా తింటూనే ఉండేవారు. ఫ్రెంచ్ ఫ్రైస్ అంటే అందరికీ మహా ఇష్టం. తినుబండారాలన్నీ బయట నుంచే తెచ్చుకుని తినేవారు. ఇంట్లో వండటానికి ఒకటి అర తినే రకాలు కాదు. కుంభాలు కుంభాలు మింగే రకాలు వీళ్ళు!

అమీన్ తన పిల్లలిద్దరికీ పాకెట్‌మనీ కూడా పుష్కలంగా ఇచ్చేవాడు. రోజుకు ఒక్కొక్కరు వంద రూపాయల స్నాక్స్ లాగించేవారు స్కూల్లోనే.

ఎంత తిన్నా ఎల్లప్పుడూ ఏదో ఒక రోగంతో బాధపడుతూనే ఉండేవారు. కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం, మోషన్స్, జ్వరం, వాంతులు... ఇలా ఏదో ఒక రోగం వాళ్ళని వెంటాడుతూ ఉండేది. డాక్టర్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఒకరోజు అమీన్‌కు విపరీతమైన ఛాతీ నొప్పి మొదలైంది. కుటుంబ సభ్యులందరూ హడలిపోయారు. వెంటనే డాక్టర్ వద్దకు తీసుకెళ్ళారు.

డాక్టర్లు అన్నిరకాల పరీక్షలు చేయించి గ్యాస్ట్రిక్ ఎక్కువ కావడం వల్ల ఛాతీ నొప్పి వచ్చింది అని తెలియజేశారు. కానీ అధిక బరువు, అధిక కొలెస్ట్రాల్ ఉన్నాయని, వీటిని నియంత్రణలో ఉంచుకోవాలని, లేకపోతే నిజంగానే గుండె సమస్యలు తప్పవని చెప్పడం జరిగింది.

అమీన్ హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయ్యాక బెడ్‌పై పడుకుని ఆలోచించసాగాడు. అంతా కాస్ట్లీ ఫుడ్ తింటున్నాం మేము. అయినా కూడా ఇంట్లో అందరికీ ఏదో ఒక రోగం పట్టి పీడిస్తోంది ఎందుకు? తిండికి ఎంత ఖర్చు అవుతుందో, హాస్పిటల్‌కు దానికంటే రెట్టింపు ఖర్చవుతుంది కదా అనుకున్నాడు మనసులో.

అమీన్‌ను పరామర్శించడానికి అతని స్నేహితుడు వాజిద్ వచ్చాడు అదే సమయంలో. అమీన్ తన సందేహాన్ని వాజిద్ ముందుంచాడు. మంచి తిండి తింటున్నా కూడా మాకు ఇలా జరుగుతుందేంట్రా అన్నాడు.

వాజిద్ అంతా విని నువ్వేమి దిగులు పడకురా. నాకు తెలిసిన డాక్టర్ ఒకరున్నారు. అతని వద్దకు వెళ్ళి దీని గురించి డిస్కస్ చేద్దాం. నీ సందేహానికి జవాబు దొరుకుతుందేమో చూద్దాం పదా అంటూ అమీన్‌ను ఒక హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడు వాజిద్.

వాజిద్ ఆ డాక్టర్‌కు చాలా క్లోజ్ అవడం వల్ల వెంటనే క్యాబిన్‌లోకి ఆహ్వానించాడు డాక్టర్. ఇతను ఎవరు అని అమీన్ వైపు చూసి అడిగాడు. ఇతను నా ఫ్రెండ్ అమీన్ అని పరిచయం చేశాడు వాజిద్.

చెప్పండి ఏ ప్రాబ్లం గురించి ఇక్కడికి వచ్చారు అని అడిగారు డాక్టర్. అమీన్ తన సందేహాన్ని తెలియజేశాడు. రోజంతా మీ ఈటింగ్ హ్యాబిట్స్ ఎలా ఉంటాయో వివరంగా చెప్పండి అన్నారు డాక్టర్. రోజంతా వాళ్ళు తినే ఆహారాల లిస్ట్ చాంతాడంత చెప్పాడు అమీన్. అది విని డాక్టర్, వాజిద్ ఆశ్చర్యపోయారు.

మీరు చెప్పిన లిస్ట్ మొత్తం ఒకేరోజు తినేస్తారా? అడిగారు డాక్టర్.

అవునండీ అని జవాబిచ్చాడు అమీన్. కొంచెమైనా గ్యాప్ ఇస్తారా? అడిగారు డాక్టర్. లేదండీ ఒకదాని తర్వాత ఒకటి, ఏదో ఒకటి తింటూనే ఉంటాము అన్నాడు అమీన్. అమీన్ సమాధానాలు విని పక్కనే కూర్చున్న వాజిద్ బకాసురుల్లా ఉన్నారు వీళ్ళు అనుకుని తనలో తాను నవ్వుకుంటూ ఉన్నాడు.

ఏమండీ అమీన్ గారు.. అంతంత ఫుడ్ తింటే రోగాలు రావా మరి అన్నాడు డాక్టర్. అదేమిటండీ... అంత తింటే రోగాలు రాకుండా బలంగా ఉండాలి కానీ రోగాలు ఎందుకు వస్తాయి? అడిగాడు అమీన్.

అతి ఎల్లప్పుడూ అనర్థమే కదండి. వయసును బట్టి మీరు చేసే వృత్తిని బట్టి తిండి తినాలి. అది కూడా సమతుల్య ఆహారం తింటేనే ఆరోగ్యం. అలాకాకుండా ఏదిపడితే అది, లిమిట్ లేకుండా తింటే మన కడుపు పాడవుతుంది. కడుపు ఆరోగ్యంగా లేకపోతే ఎక్కడలేని రోగాలన్నీ దాపురిస్తాయి. కడపు ఆరోగ్యంగా ఉంటే శరీరం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది అన్నాడు డాక్టర్.

అయితే ఇప్పుడు నేనేమి చేస్తే నా సమస్య తీరుతుంది అడిగాడు అమీన్. మితంగా తినాలి. ఏదైనా తిన్న తర్వాత అది అరిగేవరకు సమయం ఇచ్చి తర్వాత మరొకటి తినాలి. సమతులమైన, బలవర్థకమైన ఆహారం తినాలి అన్నాడు డాక్టర్.

సమతుల్య ఆహారమంటే ఏంటి డాక్టర్ అడిగాడు అమీన్. సమతుల్య ఆహారం మీ శరీరం సరిగ్గా పనిచేయడానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. తాజా పండ్లు, తాజా కూరగాయలు, తృణధాన్యాలు, చిక్కుళ్ళు, గింజలు, గుడ్లు, బాదం, చేపలు, మాంసం,పాలు, పెరుగు, పప్పు దినుసులు.. మన ఆహారంలో భాగం కావాలి. ఇవి శరీరానికి కావలసిన పోషకాలను అందిస్తాయి అన్నాడు డాక్టర్.

అంటే మీరు చెప్పిన వాటిలో ఫాస్ట్‌ఫుడ్, జంక్ ఫుడ్స్ లేనేలేవు కదా డాక్టర్? అవి తినకుండా మేము అస్సలు ఉండలేము డాక్టర్ అన్నాడు అమీన్. ఒకేసారి మీరు వీటన్నింటినీ వదలడం కష్టమే. అందుకని రోజుకు ఒకటో రెండో ఐటమ్స్ తక్కువ క్వాంటిటీలో తినండి. రుచి చూసేందుకు కొంచెం తిన్నామన్నట్లుగా తినాలి. అన్నం తిన్నట్లు కుంభాలు కుంభాలు తినకూడదు అన్నాడు డాక్టర్.

ఆహారం తక్కువగా తింటే నీరసం ఆవహిస్తుంది కదా డాక్టర్ అన్నాడు అమీన్. రోజుకు అవసరమైన కేలరీలు జీవక్రియ, వయసు, ఎత్తు, జీవనశైలి, శారీరక దృఢత్వం, మీరు తినే ఆహారం పరిమాణం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. పురుషులు, స్త్రీలకు సగటు సిఫార్సు చేయబడిన రోజువారీ కేలరీలు వరుసగా రోజుకు 2000- 2500 కేలరీలు, కార్బొహైడ్రేట్ (పిండి పదార్థాల్లో) 4 కేలరీలు/ గ్రా. ప్రొటీన్‌లో 4 కేలరీలు/ గ్రా, కొవ్వుల్లో 9 కేలరీలు/ గ్రా ఉంటాయి. దీన్నిబట్టి రోజుకు ఎంత తినాలో మనం లెక్క చూసుకోవాలి అన్నాడు డాక్టర్.

ఇంకా ఏమైనా ఆరోగ్య సూత్రాలు చెప్పండి డాక్టర్ అని అడిగాడు అమీన్. చక్కెర పానీయాలు తగ్గించాలి, మీ ఆహారంలో ఎక్కువ ప్రొటీన్లను చేర్చాలి. మిమ్మల్ని మీరు తగినంతగా హైడ్రేట్‌గా ఉంచుకోండి. అంటే తగినంత నీళ్ళు త్రాగాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తుండాలి. వేపుళ్లు తగ్గించాలి. నూనె, చక్కెర, పిండి పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తినకపోవటం మంచిది. ఎల్లప్పుడూ పాజిటివ్ మైండ్ కలిగి ఉండాలి. అప్పుడే మన శరీరం, మన మనసు ఆరోగ్యాన్ని సంతరించుకుంటుంది అన్నాడు డాక్టర్.

ఇన్ని మంచి విషయాలను నాకు తెలియజేసినందుకు చాలా ధన్యవాదాలు డాక్టర్ అన్నాడు అమీన్. మీరు మీ కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే మీ తిండి అలవాట్లను మార్చుకుంటే చాలు అన్నాడు డాక్టర్. సరే డాక్టర్ ఈ క్షణం నుంచే నేను తిండి విషయంలో జాగ్రత్తలు తీసుకోవటం మొదలు పెట్టేస్తాను. నేను, నా కుటుంబం ఆరోగ్యంగా ఉండటమే నాకు ముఖ్యం అన్నాడు ఆవేశంగా అమీన్. సరే పద రా వెళ్దాం అంటూ వాజిద్, అమీన్ డాక్టర్ వద్ద సెలవు తీసుకుని హాస్పిటల్ నుంచి బయటకు వచ్చారు.

హాస్పిటల్ ఎదురుగా బేకరీ కన్పించింది. అరేయ్ వాజిద్ బేకరీకెళ్దాం పదరా. ఏదైనా తిని వద్దాం అన్నాడు అమీన్ అదుర్దాగా. ఇప్పుడే కదరా డాక్టర్ ముందు శపథాలు చేశావ్ తిండి విషయంలో జాగ్రత్తగా ఉంటానని! అని చురక అంటించాడు వాజిద్. రేపటి నుండి పక్కా స్టార్ట్ చేస్తానురా. నోరూరిపోతుంది పదా వెళ్దాం అంటూ లాక్కుపోయాడు అమీన్. నువ్వు మారవురా... నేను మాత్రం ఏమీ తినను. నువ్వేం తినాలనుకుంటున్నావో తిను అన్నాడు వాజిద్. పఫ్, పేస్ట్రీ, కేక్, కోక్, బిస్కెట్స్ ఆర్డరిచ్చి అక్కడే తినేసి, దానికి నాలుగింతలు ఇంట్లో వారి కోసం పార్శిల్ చేయించుకున్నాడు. బకాసురులు... మీరు మారరు అనుకున్నాడు మనసులో వాజిద్.

# నిశ్శబ్ద సందేశం

- నసీరా బేగం

**మనం** ఎప్పుడైనా ఆలోచించామా... మన ద్వారా ప్రపంచంలో ఏమి వ్యాప్తి చెందుతున్నది. ప్రజలు మన ద్వారా ఏమి నేర్చుకుంటున్నారో; మంచి విషయాలా? లేదా చెడు విషయాలా అనేది. వాస్తవమైన విషయమేమిటంటే, మనిషి అతను ఏ స్థితిలో ఉన్నా, ఏ హెూదాలో ఉన్నా, విద్యాజ్ఞానాల విషయంలో ఏ కోవకు చెందిన వాడైనా సమాజంలో తప్పకుండా అతని ద్వారా మంచైనా, చెడైనా ఏదో ఒకటి వ్యాప్తి చెందుతూనే ఉంటుంది. అతనిని చూసి ప్రజలలో సత్కార్యాలు చెయ్యాలనే భావోద్వేగాలు కలుగుతాయి. లేదా దుష్కార్యాలు చెయ్యాలనే భావాలు తలెత్తుతాయి. ప్రతి మనిషి సంబంధాల, ప్రభావాల ఒక పరిసరం ఉంటుంది. కొంతమంది అతని బంధువులు ఉంటారు. మరి కొంతమంది స్నేహితులు, సన్నిహితులు ఉంటారు. ఇంకా కొంతమంది అతని క్రింద పని చేసేవారుంటారు. మరికొందరు అతని యజమానులు ఉంటారు. ఇంకా కొంతమంది అతనిని ఇష్టపడతారు. మరికొంతమంది అతనిని ద్వేషిస్తారు. ఇంకా కొంతమంది అతనిని తన పెద్దవారిగా భావిస్తారు. మరికొంతమంది అతనిని చిన్నవానిగా భావిస్తారు. కొంత మంది అతనిని పొరుగువారుగా ఉంటారు. మరికొంత మంది అతనిని భాగస్వాములుగా ఉంటారు. ఈ ప్రజలందరూ అతని ద్వారా మంచిని అయినా గ్రహిస్తారు. లేదా చెడునైనా గ్రహిస్తారు. అతని జీవితంలోని ప్రతి దినం ప్రభావం నిశ్శబ్దంగా ఇతరులపై పడి వారి జీవితాలలో మార్పులకు గురిచేస్తుంది. ఈ విధంగా అతని జీవితం ఇతరులకు నిశ్శబ్ద పాఠాలు నేర్పుతుందన్నమాట.

అయితే మనిషి తన దైనందిన జీవితం ద్వారా ఇతరులకు నిశ్శబ్ద సందేశాన్ని చేరవేస్తున్నప్పుడు అతను ఎంత జాగరూకతతో వ్యవహరించాలో స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా చాలామంది ప్రజలు తన జీవితం తన ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తారు. ఇష్టానుసారంగా జీవించటం ప్రారంభిస్తారు. లేనిపోని కొత్త విషయాలను సృష్టించి ఆచరిస్తారు. ఉన్న వాటిని కొన్నింటిని తొలగిస్తారు. అయితే వారు చేస్తున్న ఈ కార్యం ద్వారా ఇతరులపై ఎంత ప్రభావం పడుతుందో ఆలోచించరు. స్పష్టమైన విషయమేమిటంటే మనిషి మంచి చేసినా చెడు చేసినా దాని ఫలితం తప్పకుండా అనుభవించవలసి ఉంటుంది. ఎవరైనా ఒక మంచి కార్యం చేసినట్లయితే అతన్ని చూసి ఎంతమంది ప్రజలైతే దానిపై ఆచరిస్తారో దానిలోని భాగం మంచిని పరిచయం చేసిన వ్యక్తికి కూడా లభిస్తుంది. ఇది ఎప్పటివరకు కొనసాగుతూ ఉంటుందో అప్పటివరకు అతనికి చేరుతూ ఉంటుంది. అతను జీవించి ఉన్నాసరే. లేదా మరణించి మట్టిలో కలిసిపోయినా సరే. అదేవిధంగా చెడు విషయంలో కూడా అంతే. ప్రపంచంలో మొట్టమొదట హజ్రత్ ఆదమ్(అ) కుమారుడు ఖాబీల్ చేసిన హత్య. ఆ తరువాత ప్రపంచంలో

జరుగుతూ ఉన్న హత్యల భాగం అతనికి లభిస్తూనే ఉంటుంది. ఇది ఎంత గంభీరమైన విషయమో ఆలోచిస్తే గుండె వేగం పెరుగుతుంది. మనిషి చేసే ప్రతి చిన్న మంచి కార్యమైనా ప్రతి చిన్న దుష్కార్యమైనా ప్రళయ దినం నాడు అతని ముందుకు తీసుకురావటం జరుగుతుంది. ఈ విషయాన్ని అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా తెలియజేశాడ. ప్రజలు తమ కర్మలను చూసుకునేందుకుగాను, ఆ రోజున భిన్న పరిస్థితుల్లో దేవుని వైపునకు మరలుతారు. ఆ తరువాత ఎవడైనా రవ్వంత సత్కార్యం చేసి ఉన్నాసరే దాన్ని అతను చూసుకుంటాడు. అలాగే ఎవడైనా రవ్వంత దుస్కార్యం చేసి ఉన్నా సరే దాన్నీ అతను చూసుకుంటాడు." (49: 6-8)

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; ఎవరైతే ప్రజలకు ఏదైనా సత్కార్యం వైపునకు ఆహ్వానించినట్లయితే వారు అతని ఆహ్వానాన్ని అంగీకరించి ఆ సత్కార్యాన్ని ఆచరించినట్లయితే అలాంటి వ్యక్తికి వారందరితో సమానంగా అతనికి ప్రతిఫలం లభిస్తుంది. వారికి వారి ప్రతిఫలంలో ఎలాంటి కొరత చెయ్య బడదు. ఇంకా ఎవరైనా దుష్కార్యాల వైపునకు ప్రజలను ఆహ్వానించినట్లయితే ప్రజలు అతని అడుగుజాడలను అనుసరిస్తే అతనికి వారితోపాటు దుష్కార్యాల దుష్ఫలితాలు కూడా అతనికి లభిస్తుంది. దీని కారణంగా వారు చేసిన దుష్కార్యాల శిక్షలో ఎలాంటి కొరత చెయ్యబడదు. (ముస్లిమ్)

ఈ ఖుర్‌ఆన్, హదీసుల ద్వారా తెలిసిన విషయమేమిటంటే, ఒక విశ్వాసి ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి అని. తన సంభాషణపై, తన ప్రవర్తనపై, తన అలవాట్లపై, తన దైనందిన కార్యక్రమాలపై, తన సంబంధాలపై దృష్టిని సారిస్తూ ఉండాలి. తన ద్వారా తన మాటల ద్వారా, తన కార్యాల ద్వారా ప్రజలు ఏమి నేర్చుకుంటున్నారో అని డేగ కన్ను వేసి ఉంచాలి. తన ద్వారా మంచి విషయాలు ప్రచారం అవుతూ ఉంటే అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఒకవేళ చెడు విషయాల ప్రచారం అవుతూ ఉంటే వెంటనే తనను తాను మార్చుకోవాలి. తన ద్వారా ఏదైనా ఒక చిన్న దుష్కార్యం అయినా ఎవరైనా నేర్చుకుంటే అది క్రమక్రమంగా పెరిగి ఎంతగా వ్యాపిస్తుందో ఈ హదీసులో బోధించిన దాని ప్రకారం అర్థమవుతోంది. దాని శిక్ష అంతకంతగా పెరుగుతూ అతని కర్మల పత్రాన్నంతటినీ కమ్మివేస్తుంది. లేదా ఒకవేళ ఎవరైనా ఒక మంచి కార్యాన్ని అతని ద్వారా నేర్చుకున్నట్ల యితే అది అంతకంతకు పెరిగి అతని కర్మల పత్రమంతా కాంతివంతమైపోతుంది.

ఒక విశ్వాసి కోరిక ఏమై ఉంటుందంటే నా కర్మల పత్రం కాంతివంతంగా, ఫలవంతంగా ఉండాలని. సత్కార్యాల విషయంలో అతను అందరికి మార్గదర్శకంగా ఉండాలని. అయితే అలాంటి విశ్వాసుల కోసం దివ్య ఖుర్‌ఆన్‌లో ఒక దుఆ నేర్పబడింది. 'వజ్‌అల్‌నా లిల్ ముత్తఖీన ఇమామ' ఓ అల్లాహ్ మమ్మల్ని భయభక్తులు కలవారికి ఇమాములుగా చేయి (25: 74) అంటే జీవితంలోని ఏ భాగానికి చెందిన విషయంలో నాయకునిగా ఉంటాడో అతను తన వెనుక ఉన్నవారి కోసం ఉపమానంగా ఉండాలి. విశ్వాసులు చేసే ఈ దుఆ అర్థం ఏమిటంటే, ఓ అల్లాహ్ మమ్మల్ని సజ్జనులుగా తీర్చిదిద్దు. మాకు మా వెనుక వారి కోసం ఒక నమూనాగా ఉంచు. మేము సత్కార్యాల ద్వారా జ్ఞాపకం చెయ్యబడాలి. మా ద్వారా మంచి విషయాలు ఎంతగా వ్యాపించేలా చెయ్యాలంటే మా తరువాత ప్రజలు మా మంచి విషయాల ద్వారా గుర్తించి మమ్మల్ని జ్ఞాపకం చేసుకోవాలి. మా అడుగు జాడలలో నడిచి పుణ్యకార్యాలు మాకు చేరవేయాలి అని.

అయితే విశ్వాసి మనసులో కలిగే స్వచ్ఛమైన ఈ కోరిక నెరవేరాలంటే అతను హృదయం లోపల, హృదయం బయట ఒకేలా ఉండాలి. అతని మాటలలో అతని ఆచరణ లలో ఎలాంటి వ్యతిరేకత ఉండకూడదు. అప్పుడే అతని వ్యక్తిత్వం ఇతరులపై ప్రభావితం చూపుతుంది. ఒకసారి దైవ ప్రవక్త(స) గారి ఒక అనుచరుడు హర్‌మల (రజి) ఆయన(స) గారితో ఓ దైవప్రవక్తా(స)! మీరు నాకు ఏ కార్యాలు చెయ్యమని బోధిస్తున్నారు అని. దానికి ఆయన(స) ఇలా సెలవిచ్చారు : సత్కార్యాలు చెయ్యి. దుష్కార్యాల నుంచి దూరంగా ఉండు. ఒకవేళ నీవు ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించిన తరువాత కూడా నిన్ను మంచి పేరుతో జ్ఞాపకం చెయ్యాలనుకుంటే నీవు అలాంటి ఉత్తమ గుణాలనే పెంపొందించు. ఇంకా నీవు ఏ దుష్కార్యాల పేరుతో నిన్ను జ్ఞాపకం చెయ్యకూడదని నీవు భావిస్తే జీవితంలో ఆ దుష్కార్యాల నుంచి దూరంగా ఉండు.

వీటన్నిటి ద్వారా తెలిసిన విషయమేమిటంటే అతను కోరినా కోరక పోయినా అతని ఆచరణల ద్వారా అతను ప్రజలకు సందేశాన్ని చేరవేస్తున్నాడు. అతను ఆ విషయాన్ని గ్రహించినా లేదా గ్రహించకపోయినా అది జరుగుతూనే ఉంటుంది. కనుక తన వ్యక్తిత్వాన్ని తాను తీర్చిదిద్దుకోవాలి. అప్పుడు అతనికి లాభం ఉంటుంది. అతని చుట్టుప్రక్కల వారికి కూడా లాభం కలుగుతుంది. అతని తరువాత వారికి కూడా అతని సందేశం చేరుతుంది. ❖




## హర్యానా హింసాకాండ తర్వాత ముస్లిములకు ప్రవేశం లేదన్న 50 గ్రామ పంచాయతులు

నూహ్‌లో అల్లర్ల తర్వాత పరిస్థితులు మరింత తీవ్రమయ్యాయి. ఈ అల్లర్లలో ఆరుగురు మరణించారు. హర్యానాలోని 50 గ్రామ పంచాయతులు తమ ప్రాంతాల్లోకి ముస్లిం వ్యాపారులు ప్రవేశించ రాదని లేఖలు జారీ చేశాయి. రేవారి, మహేందర్ ఘర్, ఝుఝూర్ జిల్లాల్లోని ఈ ఊళ్ళ గ్రామ సర్పంచుల సంతకాలతో ఈ లేఖలు జారీ అయ్యాయి. అంతేకాదు, తమ ఊళ్ళలో నివసిస్తున్న ముస్లిములు తమ గుర్తింపు పత్రాలను పోలీసులకు చూపించాలని కూడా ఈ లేఖల్లో ఆదేశించారట. నూహ్‌లో విశ్వహిందూ పరిషద్ ర్యాలీ తర్వాత నూహ్, గురుగ్రామ్ ప్రాంతాల్లో హింసాకాండ జరిగింది. ఇందులో ఇద్దరు హోంగార్డులు, ఒక మస్జిదు ఇమాము మరణించారు. హర్యానా ప్రభుత్వం 312 మందిని అరెస్టు చేసింది. మరో 106 మందిని ముందుజాగ్రత్తగా నిర్బంధించింది. మొత్తం 142 కేసులు నమోదయ్యాయి. హర్యానా హోం మంత్రి అనిల్ విజ్ ఈ విషయాలు తెలియజేశాడు. ఆగష్టు 11 వరకు ఇంటర్నెట్, ఎస్సెమ్మెస్ సేవలు స్తంభింపజేశారు. ఈ ప్రాంతాల్లో నిషిద్ధ ఆజ్ఞలు అమల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ గ్రామ పంచాయతుల లేఖ ముందుకు వచ్చింది. నార్నౌల్ సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ వీటికి సంబంధించి బ్లాక్ కార్యాలయాలకు విచారణ జరపాలని రాశారు. కాగా హిస్సార్లో కొన్ని పంచాయతులు తమ ఊళ్ళలోని దుకాణాల్లో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులను తొలగించాలని ఆదేశించా యట, అలా చేయకపోతే బహిష్కరిస్తామని చెప్పాయట. దీనిపై జాతీయస్థాయిలో ఆందోళన వ్యక్తమయ్యింది. ముస్లిములపై హత్యాకాండకు పిలుపునిచ్చే ప్రసంగాలు, సామాజికంగా, ఆర్థికంగా బాయ్ కాట్ చేయాలని ర్యాలీలో ఇచ్చిన పిలుపులపై సుప్రీం కోర్టులో కేసు దాఖలయ్యింది. సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ ఈ విషయాన్ని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ దృష్టికి తీసుకువచ్చారు. ముస్లిములను ఉద్యోగులుగా పెట్టుకున్న వ్యాపారసంస్థలను దేశద్రోహులుగా తీర్మానిస్తూ గురుగ్రామ్లో ప్రసంగాలు చేశారని తెలియజేశారు. హర్యానాలో దిగజారిన పరిస్థితులకు ఇది నిదర్శనం. పరిస్థితిని చక్కబెట్టడానికి తక్షణం వివిధ వర్గాల మధ్య చర్చలు, అవగాహనా కార్యక్రమాలు జరగవలసిన అవసరం ఉంది.

## జైపూర్ రైలు విషాదంపై నిరసనోద్యమాలు

ముంబయి జైపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన మారణకాండ తర్వాత జైపూరులో ముస్లిములు రోడ్లపైకి వచ్చారు. జులై 31వ తేదీన రైల్వే పోలీసు కానిస్టుబుల్ చేతన్ సింగ్ నలుగురిని హతమార్చాడు. అందులో చేతన్ సింగ్ పైఅధికారి కూడా ఉన్నాడు. ఆ తర్వాత పేరు అడిగి ముస్లిములను గుర్తించి ముగ్గురిని చంపాడు. ఈ హత్యాకాండ తర్వాత జైపూరులో వేలాది మంది రోడ్లపైకి వచ్చారు. ఈ హత్యాకాండలో మరణించిన బాధితుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, నివాస గృహాన్ని నష్టపరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజలు ప్రదర్శనలు నిర్వహించారు. యునైటెడ్ సంఘర్ష్ మోర్చా క్రింద దాదాపు ఇరవై నాలుగు ముస్లిం సంఘాలు ఈ నిరసనకు పూనుకున్నాయి. తమ డిమాండ్లు ప్రభుత్వం నిర్దిష్ట కాలంలో పూర్తి చేయాలని, లేకపోతే నిరసన మరింత తీవ్రమవు తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ నివాసాన్ని ముట్టడిస్తామని అన్నారు. ప్రజలంతా కలిసి రాజస్థాన్‌కు చెందిన హతుని కుటుంబానికి లక్ష రూపాలయ నగదు సేకరించి అందజేశారు. జైపూరు హత్యాకాండ అంతర్జాతీయ మీడియాలో కూడా చర్చకు వచ్చింది. ముస్లిములను లక్ష్యంగా చేసుకుని జరిగిన హత్యాకాండగా అంతర్జాతీయ మీడియా రాసింది. పైగా చేతన్ సింగ్ తాను చంపిన వ్యక్తి శవం దగ్గర నిలబడి రాజకీయంగా ఎవరికి ఓటువేయాలో సూచిస్తున్నట్లు మాట్లాడిన వీడియో వైరల్ అయ్యింది. దేశంలో మతోన్మాద విద్వేష వాతావరణం ఎంతగా అలుముకుందో ఈ సంఘటన చాటి చెబుతోంది.

## తుదిశ్వాస విడిచిన పాత్రికేయ శిఖరం జహీరుద్దీన్ ఖాన్

సియాసత్ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీ ఖాన్ అగష్టు 7వ తేదీన మరణించారు. ఆయన వయసు 63 సం॥లు. యుద్ధనౌకగా పేరుపడిన ప్రజాకవి గద్దర్ అంతిమ యాత్రలో పాల్గొనడానికి వెళ్ళిన జహీరుద్దీన్ ఖాన్‌కు అక్కడే గుండెనొప్పి వచ్చింది. గద్దర్ అంతిమ యాత్రలో పాల్గొన్న జహీరుద్దీన్ ఖాన్ సాయంత్రం 5 గంటల సమయంలో తనకు అస్వస్థతగా ఉందని చెప్పడంతో ఆయన్ను కొంపల్లిలోని ఒక ఆసుపత్రికి తీసుకెళ్ళారు. కాని అప్పటికే ఆయన తుదిశ్వాస విడిచారు. జహీరుద్దీన్ అలీ ఖాన్ గొప్ప సమాజ సేవకుడిగా, మానవతా వాదిగా, ముస్లిం సమస్యలపై గొంతువిప్పిన పాత్రికేయునిగా తెలుగు రాష్ట్రాల్లో పేరు పొందారు. పేదవారికి సహాయపడడం, మైనారిటీ డెవలప్ మెంట్ ఫోరమ్ ఏర్పాటు, మురికివాడల ప్రజలకు ఉచిత వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడం, పేద మహిళలకు వృత్తిపరమైన శిక్షణ, ఇంగ్లీషు మాట్లాడే శిక్షణ వంటి అనేక కార్యక్రమాలు ఈయన నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆయన చాలా వరకు సామాజిక కార్యక్రమాల్లోనే గడుపుతూ వస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, హోంమంత్రి మహ్మూద్ అలీ, మునిసిపల్ మంత్రి కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తదితర నేతలు సంతాపాన్ని ప్రకటించారు. ప్రముఖ పాత్రికేయుడు జహీరుద్దీన్ ఖాన్ మరణం ముస్లిం సమాజానికే కాదు, పాత్రికేయ సముదాయానికి, యావత్తు సమాజానికి తీరని లోటని అన్నారు.

## ద్వంద్వప్రమాణాలకు మారుపేరు ఇస్రాయీల్ - పాలస్తీనా ప్రతిఘటనకు ఇస్రాయీల్ అధికారుల ప్రతిస్పందన

పాలస్తీనాలో ఇస్రాయీల్ దురాక్రమించుకున్న భూభాగాల్లో ఇస్రాయీల్ అధికారులు కఠినమైన, ఇంకా చెప్పాలంటే అక్రమమైన, చట్టవిరుద్ధమైన పద్ధతుల్లో పాలస్తీనా ప్రతిఘటనను అణిచేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ అణిచివేత అనేకరకాలుగా కొనసాగుతోంది. పాలస్తీనా ప్రజలను లక్ష్యంగా చేసుకుని శరణార్థి శిబిరాల్లో, జైళ్ళలో ఇంకా అనేక ఇతర ప్రదేశాల్లో ఈ అణిచివేతలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ చట్టం ప్రకారం ఇస్రాయీల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రతిఘటన చట్టబద్ధమైనది. కాని ఈ ప్రతిఘటనలో పాల్గొంటున్న వారి పట్ల ఇస్రాయీల్ అధికారులు అమానుషమైన శిక్షలు విధిస్తున్నారు. నిర్బంధాలు, సైనిక చర్యలు, కాల్పులు, అమాయకులను హతమార్చడం కొనసాగుతోంది. పైగా ఈ సంఘటనలు జరిగినప్పుడు ఇస్రాయీల్ అధికారులు పండుగ చేసుకుంటున్నారు. ఆత్మ రక్షణ కోసం చేసామని సాకులు చెబుతున్నారు. ఈ సాకులను అంతర్జాతీయంగా కొన్ని దేశాలు ఒప్పేసుకుంటున్నాయి. ఇటీవల జెనిన్ శరణార్థి శిబిరం వద్ద ముగ్గురు పాలస్తీనీయులను ఇస్రాయీల్ అధికారులు చంపేశారు. ఇస్రాయీల్ ప్రధాని నెతన్యాహు ఈ హత్యలను సమర్థించడమే కాదు, ప్రశంసించాడు. కాగా మరోవైపు ఇద్దరు యూద సెటిల్లర్లు, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన ఆరోపణలున్న వారిని జైలు నుంచి విడుదల చేసవారు. పాలస్తీనాలోని వెస్ట్ బ్యాంక్‌లో 19 సంవత్సరాల పాలస్తీనా యువకుడిని దారుణంగా చంపేసిన ఈ ఇద్దరిని విడుదల చేయడం ఇస్రాయీల్ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. ఇస్రాయీల్ న్యాయవ్యవస్థలో కూడా ఈ ద్వంద్వ ప్రమాణాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఒక పాలస్తీనా వ్యక్తి ఎవరైనా ఇస్రాయీల్ సెటిల్లర్‌ను హత్య చేస్తే యావజ్జీవ కారాగార శిక్ష. ఒక్కోసారి ఘర్షణల్లో ఎవరైనా ఇస్రాయీల్ సెటిల్లర్ మరణిస్తే ఆ ప్రాంతంలోని పాలస్తీనీయులందరినీ శిక్షిస్తారు. ఇండ్లను కూల గొడతారు. కాని అదే ఇస్రాయీల్ సెటిల్లరు ఎవరైనా పాలస్తీనీయుడిని చంపితే చిన్నపాటి శిక్షతో వదిలేస్తారు. ఇటీవల ముగ్గురు పాలస్తీనీయులను కోర్టు వదిలేయడం దీనికి పెద్ద ఉదాహరణ. మరో విషయమేమిటంటే ఇస్రాయీల్ అరబ్బు పార్లమెంటు సభ్యుడు అహ్మద్ తిబీ పాలస్తీనీయుల నిర్బంధ శిబిరాలను సందర్శించడానికి అనుమతి ఇవ్వలేదు. కాని అదే ఇస్రాయీల్ యూద పార్లమెంటు సభ్యులైతే గాయపడిన యూద సెటిల్లర్ల శిబిరాలను సందర్శించే అనుమతి ఉంది. అలాగే ఉగ్రవాదులుగా పేరుమోసిన యూద సెటిల్లర్లకు జైళ్ళలో రాజభోగాలు లభిస్తాయి. కాని పాలస్తీనా ఖైదీలకు అమానుష పరిస్థితులే ఉన్నాయి. వారి కుటుంబ సభ్యులు కలుసుకునే అవకాశం లేదు. వారికి వైద్యసదుపాయాలు ఉండవు. క్లుప్తంగా చెప్పాలంటే ఇస్రాయీల్ జాతివివక్షతో కూడిన ద్వంద్వ ప్రమాణాలు అక్కడి కోర్టుల్లోను కనిపిస్తున్నాయి. దీనివల్ల ఈ ప్రాంతంలో శాంతిస్థాపన అనేది సుదూర స్వప్నంగానే మిగిలి పోతోంది.

## మలేషియా ఎన్నికలు - అన్వర్ ఇబ్రాహీం ఎదుట సవాళ్ళు



మలేషియాలో ప్రాంతీయ ఎన్నికలు జరిగాయి. మలేషియాను పాలిస్తున్న పాలక పక్షం మూడు రాష్ట్రాల్లో ఆధిక్యత నిలబెట్టు కుంది. దేశంలోని అతి సంపన్న రాష్ట్రం సెలంగోర్‌లో కూడా తన స్థానాలు కాపాడుకుంది. ఈ ఎన్నికల ఫలితాలు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రాహీం మెజారిటీకి ఇప్పట్లో ఎలాంటి ప్రమాదం లేదని తెలియజేశాయి. గత తొమ్మిది నెలలుగా అన్వర్ ఇబ్రాహీం సంకీర్ణ ప్రభుత్వంపై ప్రజలు ఎలా ఆలోచిస్తున్నారో దీన్ని బట్టి తెలుస్తోంది. అయితే మరోవైపు ప్రతిపక్షాలు మూడు రాష్ట్రాల్లో తమ ఆధిక్యతను కూడా నిలబెట్టుకున్నాయి. దేశంలోని మాలే ముస్లిముల్లో ప్రతిపక్షాల పలుకుబడి పెరుగుతుందని కూడా దీనివల్ల తెలుస్తోంది. ప్రతిపక్షాల కూటమికి మాజీ ప్రధాని ముహియుద్దీన్ యాసిన్ నాయకత్వం వహిస్తున్నారు. దేశంలోని ఆర్థిక సమస్యలు, ధరల పెరుగుదల, ఆర్థిక ప్రగతి కుంటు పడడం, మలేషియా కరెన్సీ విలువ పడిపోవడం వంటి సమస్యలపై ఓటర్ల ధోరణి కూడా అర్థమవుతోంది. అన్వర్ ఇబ్రాహీం ఇటీవల తీసుకున్న కొన్ని చర్యల పట్ల ప్రజల్లో సానుకూలత కూడా కనబడింది. అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి అన్వర్ ఇబ్రాహీం సంస్కరణలు చేపట్టారు. సంపన్నులకు సబ్సిడీలను తగ్గించారు. అయితే అన్వర్ ఇబ్రాహీం ప్రభుత్వం LGBTQ పట్ల అసహనం చూపిస్తున్నారని, వారి హక్కులను గుర్తించడం లేదన్న ప్రచారంతో ఆయన్ను విమర్శించే వాళ్ళు చాలా మంది ఉన్నారు. ఈ ప్రాంతీయ ఎన్నికలు మలేషియా ప్రజలు తర్వాత ఎవరికి పట్టం కడతారన్నది తెలుసుకనే సూచనలని కూడా చాలా మంది భావిస్తున్నారు.

# నిజమైన దేశభక్తి

- షేక్ అబ్దుల్ బాసిత్

**జన్మభూమి**పై మమకారం ఉండాలి. కాని ఇతరుల జన్మ భూమిని కూడా గౌరవించే గుణం అవసరం.

"తనకు తాను సుఖపడితే తప్పు కాదు. తన చుట్టూ ఉన్న వారు కూడా సుఖంగా ఉండాలి అని కోరుకోవాలి" అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

ఈ సృష్టికి సృష్టికర్త అయిన దేవుడు ఒక్కడే. మానవులందరు సమానులే. కులం మతం ప్రాంతం, జాతి, వర్ణం, ధనికులు పేదలు అనే బేధ భావం వలదని చాటి చెప్పినప్పుడు. మక్కా ధనవంతులు ప్రవక్తను, ఆయన అనుచరులను ఊరు నుంచి వేలి వేసి, ఆహారం నీరు అందకుండా బంధించారు.

వారి దౌర్జన్యాలు, ఆగడాలు భరించలేక మదీనా వలస వెళుతూ, మక్కాలోని కాబా గృహం వైపు చూస్తూ,

ఓ మక్కా నగరమా నిన్ను విడిచి వెళ్ళడానికి మనసు అంగీకరించడం లేదు. కానీ ఈ దుర్మార్గుల దౌర్జన్యాలను భరించలేక వెళ్ళుతున్నాను అని ఆవేదన వ్యక్తం చేశారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

పుట్టి పెరిగిన ఊరు మీద ఊరివాళ్ళ మీద ప్రతి ఒక్కరికీ ప్రేమానురాగాలు ఉండటం సహజం. ఊరి మీద నిజమైన ప్రేమ ఉంటే ఆ ఊరికి ఎలాంటి నష్టం కలుగకుండా చూసుకోవాలి. ఆ ఊరిలో పెరిగి పెద్దయినందుకు ఆ ఊరికి ఏదైనా మంచి పనిచేసి చూపించాలి.

అలాగే నిజమైన దేశభక్తి అంటే ఆ దేశానికి ఎలాంటి కష్టం నష్టం వాటిల్లకుండా చూడ్డమే.

దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా.

దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్.

దేశమును ప్రేమించే వారు ఆ దేశంలోని సాటి మానవుల పట్ల మంచితనంతో, ప్రేమ అనురాగాలతో, అప్యాయత అనుబంధాలు కలిగి ఉండాలి.

అన్నింటికన్నా ముఖ్యంగా సకల చెడులకు దూరంగా ఉంటూ మంచి పనులు చేస్తూ జీవించాలి. అంతేకాదు సమాజంలో చెడులు జరుగకుండా చూడాలి.

న్యాయం ధర్మం నాలుగు పాదాల నడిచే లా చూడడమే దేశం మీద నిజమైన ప్రేమ. అదే నిజమైన దేశభక్తి.

మీలో మంచి వైపుకు పిలిచేవారు, చెడునుంచి వారించే వారు కొందరు తప్పకుండా ఉండాలి. వారే సాఫల్యం పొందేవారు అని ఖురాన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు.

మీలో ఎవరైనా చెడు జరుగుతుండగా చూసినట్లు అయితే, చేతితో ఆపాలి. అంటే బలాన్ని ఉపయోగించి ఆపాలి. లేదా నోటితో నైనా ఆపాలి. అంటే నువ్వు చెడు చేస్తున్నావు తప్పు చేస్తున్నావు అని చెప్పాలి. లేదా కనీసం మనసులోనైనా చెడు చెస్తున్నావు అని అనుకోవాలి. లేదా ఆ చెడు మీరు చేసినట్లే అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

మంచివారు నూటికి తొంబై శాతం ఉన్న, చెడును చెడు అని చెప్పే ధైర్యం లేకపోవడంతో నేడు చెడు రాజ్యం ఎలుతుంది. మద్యం, జూదం, వ్యభిచారం నట్టింట్లో నాట్యం చేస్తున్నాయి. మనం మన సంతానం కూడా ఆ చెడుల వరదల్లో చిక్కుకుని అల్లాడుతున్నాం.

చెడు చేయడానికి సిగ్గుపడే రోజులు పోయాయి. చెడు చేయడమే ఫ్యాషన్ అయిపోయింది.

ఎప్పుడైతే చెడును చెడు అని మనసులో కూడా అనుకోరో, అప్పుడు దైవం ఏలా అయితే ఒక పూసల దండల తెగిపోతే, పూసలు ఒకదాని వెంట ఒకటి రాలుతాయో అలా మీ మీద అపదల వెల్లువ విరుచుకుపడుతాయి. అప్పుడు మీరు విలపిస్తారు. దైవాన్ని ప్రార్థిస్తారు. కానీ దైవం మీ మొరలు ఆలకించడు. అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

మన ఇల్లు పరిశుభ్రంగా ఉంటే సరిపోదు. మన చుట్టూ ఉన్న ఇళ్ళు కూడ పరిశుభ్రం గా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. లేదా బయటి కంపు కొడుతుంటే వాటివల్ల ప్రబలే రోగాలు మనకు కూడా అంటుకుంటాయి.

అందుకే

నిజమైన భక్తి పరులు దైవాన్ని విశ్వసించేవారు చెడులకు దూరంగా ఉంటూ సమాజంలో చెడులను దూరం చేయాలి లేదా ఆ చెడుల ఊబిలో చిక్కుకొని మనం మన సంతానం కూడా కొట్టుకుపోతాం.

రండి! నేటి నుంచి నిశ్చయించుకుందాం. చెడు చేయను. చెడు చేయనియ్యను. నేను నా చుట్టూ ఉన్న సమాజంలో న్యాయం, ధర్మం ప్రేమ అప్యాయత అనురాగాలు మానవతా విలువలు వెల్లివిరిచేలా నిరంతరం కృషి చేస్తాను అని.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**